# అసురగణం

శ్రీ క. నా. సుబ్రహ్మణ్యం

శ్రీ క. నా. సుబ్రహ్మణ్యం పూర్తి పేరు కందాడయార్ నారాయణస్వామి అయ్యర్ సుబ్రహ్మణ్యం. తమిళములో ప్రసిద్ధ రచయిత. మంచి నవలలు, కథలు రచించారు. "అసురగణ"మన్న వారి పెద్ద కథను తెలుగులోనికి శ్రీయుతులు బి. వి. సింగరాచార్య, పి. సభాపతి అనువదించారు.

## ముందు మాట

సర్ జాన్ ఫ్రేజర్ రచించిన "Golden Bough" అన్న సుప్రసిద్ధ గ్రంథంలో, ఒక విషయం చెప్పాడు. పసిఫిక్ దీవులకు చెందిన ఆదిమ జాతి మనుష్యుల్లో, ఒక దీవివాళ్లకి, విచిత్రమైన నమ్మక మొకటుంది. ఒకడి నీడని ఇంకొకడు తొక్కితే, మొదటివాడి మంచి గుణాలన్నీ వెంటనే వాణ్ణి వదిలేసి, నీడని తొక్కినవాణ్ణి ఆవేశిస్తాయన్న నమ్మకం వాళ్ల కుందని ఫ్రేజర్ తన గ్రంథంలో వ్రాశాడు.

మానవ శరీరం వెలుతుర్ని అడ్డగించి, నీడను ఏర్పరుస్తుంది. అలాగే మనస్సుమీద వెలుతురు ప్రసరించడంవల్ల మనస్సు తాలూకు నీడ కూడా ఏర్పడవచ్చు. అది మన కళ్లకి కనబడక పోయినంతమాత్రాన, మనస్సుకి నీడంటూ ఉండదని చెప్పలేం. "మానవ సంతతి ఛాయా పరంపరే చరిత్ర" అని ఎమర్సన్ చెప్పింది ఈ అర్థంలోనే వాస్తవమేమో.

జోస్యులు తమ అజ్ఞానంవల్ల (లేక జ్ఞానం చేతనే అనుకోండి!) మానవుల్ని దేవగణం, మనుష్య గణం, అసురగణం అని మూడు గణాలుగా విభజిస్తున్నారు. మానవ సంతతి మన కళ్లెదుటే నడయాడుతూంది. దేవసంతతీ, అసురసంతతీ కేవలం కల్పన అని భావిస్తున్నాం. ఒకప్పుడు దేవతలూ, దానవులూ మానవులకు తోడుగాను, విరోధులుగాను ఉండేవాళ్లని గ్రీకు, భారతీయ, చైనా దేశాల పురాణాలు చెబుతున్నాయి. మానవులలో మనుష్యగణం క్షీణిస్తూంది; దేవగణం అరుదైపోయింది; అసురగణంమట్టుకే వృద్ధి పొందుతూంది. ఇదే ఈ రోజుల్లో నిదర్శన పూర్వకంగా కనిపిస్తూంది మనకు. మనమిప్పుడనుకుంటున్నదంతా కాలవైపరీత్యమే అయుండొచ్చు. పిచ్చి ఆలోచనే అయుండొచ్చు. కాని రామ రావణ యుద్ధంతోనో, కాళీ మహిషాసుర యుద్ధంతోనో, కృష్ణ నరకాసుర యుద్ధంతోనో, ఈ లోకంలో అసురసంతతి పూర్తిగా నశించిపోలేదు. (అలా నశించటం మంచిదా, కాదా అన్నది వేరే విషయం!) అంచేతే, ప్రతి సంవత్సరం మనం దీపావళి, నవరాత్రి పండుగలు చేసుకుంటున్నాం; రామాయణాన్ని భక్తి శ్రద్ధలతో పఠిస్తున్నాం, కాలక్షేపాలు వింటున్నాం.

మానవుల ఛాయల్లో దేవతల్నీ చూడొచ్చు, దానవుల్నీ చూడొచ్చు. మానవుల్నిమట్టుకే చూడటం నేర్చుకున్నవాడు పరిపక్వము పొందినవాడని చెప్పవచ్చు. శరీరచ్ఛాయ, మనస్సు తాలూకు ఛాయ—ఇలా ఎన్నో ఛాయలున్నాయి.

కల్పనకూ, నిజానికీ; కలకూ, దైనందిన జీవితానికీ గల సంబంధాల్ని రెండు మూడు వేల యేండ్లుగా ఎంద రెందరో తరచి చూస్తూ వచ్చారు. "The mind is in its own place, and can make a hell of heaven and a heaven of hell" అన్న సత్యాన్ని మహాకవులు, ఎన్నోచోట్ల చాటినా, అంగీకరించటానికే మానవుడికి నమ్మకం చాలటం లేదు. నిజం నిజం కాదు; అబద్ధం అబద్ధం కాదు—ఈ విషయం నిజం, అబద్ధం అన్న మాటల్లోనే దాగి ఉన్న సత్యం. వెలుగు—నీడ; రాత్రి—పగలు; మంచి—చెడు; స్వర్గం—నరకం—లాంటి ద్వంద్వాలు ధ్వనించే మాటలు నిజం—అబద్ధం రెండూ కలసినవే.

నా రాముడు,—లక్ష్మణు డొకడు వచ్చి తనకి సహాయ పడకపోవటంవల్ల—తనే, తన చేతుల్తోనే ఒక హత్య చేస్తాడు. ఆ హత్య అతని మనస్సులో జరిగింది కనుక, అతణ్ణి హంతకుడుగా పరిగణింపకపోవచ్చు. నా కథలోలాగ ప్రేమకే, వాడు దూతగా మారవచ్చు. కాని శూర్పణఖ మరణించిన మాట నిజమేనని గట్టిగా చెప్పవలసిన అవసరం వుంది. ఒక శూర్పణఖ ప్రాణం

పోగొట్టుకొని, మానభంగం పొంది, ముక్కు చెవులు కోయించుకొని, పరాభవం పొందటం చాలదు. అందువల్ల శూర్పణఖ సంతతి నశించిపోదని కూడా ఈ కథలో వ్యంగ్యమవుతుంది.

నీతి ఏమిటంటే, కథ చెప్పటంలో కూడా అంతగా నమ్మకంలేని నవలా రచయితని నేను. కథలుగా మాత్రమే నవలలు చదవటానికి నేర్చుకున్న పాఠక లోకాన్ని నా నవల కష్టపెడుతుందని నాకు తెలుసు. సాహిత్యకారుడుగా రచన చేసేటప్పుడు, నాకు నా పాఠకుల్ని గురించిన ప్రసక్తి ఏమాత్రం లేదు.కాని రాసేసిం తర్వాత, చదివినవాళ్లేమనుకుంటారో వూహించుకుని, జవాబు కూడా చెప్పేద్దామనిపించింది. సంభవాలుగాని, సంభవాల తాలూకు ఛాయలుగాని విశదీకరించటానికి ఈ నవల రచించలేదు నేను. నా కథా నాయకుడు రాముడి మనస్సులో ఛాయల్నిమాత్రం సాధ్యమయినంత వరకూ, మాటల్లో చెప్పేయడానికి ప్రయత్నించాను. లారెన్స్‌స్టెర్నీ, ఫ్రాన్స్ కాఫ్కా, మార్సల్ ప్రూస్ట్—రచనల వారసత్వం ఉంది ఈ నవలకు. నవల రాసేటప్పుడు ఈ భావా లేవీ నా మనస్సులోలేవు—కాని రాసేసిం తర్వాత నే నొక పాఠకుణ్ణిగా, విమర్శకుణ్ణిగా చదివినప్పుడు తోచిన విషయాలు చెబుతున్నాను.

లోకంలో ప్రతివాడూ తాను అసాధారణుడనుకుని గర్వపడుతూంటాడు. ఈ కథలో రాముడు కూడా దీని కతీతుడు కాడు. ఈ అసాధారణత్వంలోని సాధారణత్వాన్ని, అబద్ధంలోని నిజాన్ని, నిజంలోని అబద్ధాన్ని, మానవుని ఛాయలో దాగివున్న దేవ, అసుర, మనుష్యగణాల్ని కొంతవరకూ చూపడమే నా నవల లక్ష్యం. మధ్యలో అక్కడక్కడ వచ్చిపోయే రుక్కు, హేమ వంటి పాత్రల చిత్రణలో కృతకృత్యుడనయాననే అనిపిస్తూంది. రాముడూ,శూర్పణఖా విజయం కోసమే అవతారం దాల్చినవాళ్లు—అందులో నా ప్రజ్ఞ ఏమీ లేదు.

పదమూడేళ్లకుపైగా, మనస్సులో మాగుతూ వుండిన వస్తువు ఇది. సంపూర్ణంగా రూపకల్పన చేయటానికి నాలుగుసార్లు రాయాల్సి వచ్చింది. రాసేసిం తర్వాత "వదిలేస్తున్నామే!" అన్న బాధ కలిగింది. అనివార్యమైన వియోగం ఇది. అయినా తృప్తి నిచ్చే వియోగమే.

తిరువళి క్కేణి, క. నా. సుబ్రహ్మణ్యం.

**1**

సన్నాయిపాట వింటూంటే ఎవరికైనా చావు తలపులు వస్తాయా?

నాకు వస్తాయే!......ఏం చెయ్యను?

ఆరోజు బుధవారం అనుకుంటాను· మా వీధిలో ఒక ఇంట్లోంచి సన్నాయి మేళం వినబడుతూంది. అలవాటు ప్రకారం నిన్నటి ప్రపంచాన్ని నెమరు వేసుకొంటూన్న నాకు నాదస్వర శబ్దం చెవినిబడగానే, ఒకదానివెంట ఒకటిగా ఎన్నో చావుల జ్ఞాపకాలు వచ్చేశాయి.

నాదస్వరం నా చెవులలో చిల్లులు పొడుస్తూంది. పక్కన మూడో ఇంట్లోంచి, డోళ్లు పగిలిపోయేట్టు బాదుతున్నారు, నా చెవి గూబలు కూడా బద్దలు చేస్తూ.

నా భావనా మేఘాలు ఆ శబ్దం వినపడగానే చెల్లాచెదరై పోవలసింది.

సాధారణంగా సన్నాయిమేళం వినేవాళ్ళు శుభ కార్యాలు వూహిస్తారు. అదేనేమో మానవ స్వభావం! నా స్వభావం కొంచెం భిన్నమైనది, విచిత్రమైనది.

కొంచెం అనడం కూడా తప్పే! పూర్తిగా విచిత్రమైందనే చెప్పాలి.

ఈ పద్దెనిమిది సంవత్సరాలలో నాకు తెలిసిన—నేను స్వయంగా చూసిన—చావులన్నింటినీ నాకు జ్ఞాపకం తెస్తూంది ఆ సన్నాయి స్వరం.

అవును, అన్నీ చావు తలపులనే!

క్రిందటి వారం మిట్ట మధ్యాహ్నం నడివీధిలో దిగంబరంగా చచ్చి పడిఉన్న ఆ దిక్కులేని ముసల్ది!......ఎన్నిసార్లు ఆమెకు బిచ్చం వేయడానికి నిరాకరించానో! అంతకుపూర్వం మా అమ్మ చావు!—చావునుంచి ఏమాత్రం వంపులు తిరగని సూటి చావది! ఇంకా పూర్వం నడివీథిలో ఒక మోటారుక్రింద చిక్కుకొని మెదడు చితికి—అల్పమైన మెదడు అది—చచ్చిపోయిన ఆ యువకుడు!......ఇటువంటివి ఎన్నో చావులు.

వీధిలో వేకువజామున శాస్త్రోక్తంగా పేడనీళ్లు చల్లుతూన్న తొమ్మిదేండ్లపిల్ల మీదకి—ఆమె పేరు "వాలం" అని జ్ఞాపకం—హఠాత్తుగా వచ్చిపడిన బస్సు. అదే నా "మొదటి చావు." అప్పుడు నాకు పదేళ్ళుంటయ్యనుకుంటాను.

వీథిలో విన్న ఈ సన్నాయి స్వరం కెలికిన నా చావు తలపులు ఒక దానివెంట ఒకటిగా, ఇంకా చెరిగిపోని ఏదో సుదూర కాలానికి, దూర ప్రదేశాలకి నన్ను కూడా దాటి వెళ్ళిపోతున్నాయి.

**2**

నేనేమో అందరిలాగ, సాధారణులైన ఇతరులందరిలాగ, సాధారణమైనవాణ్ణి కాననే ఒక వూహ అడుగడుగునా వాలో మొలకెత్తుతూంది. అందరిలాగ సాధారణ ధోరణిలో నడచుకోటం నాకు చేతనవడం లేదు! ఏం చెయ్యను!

నా మనస్సు, పోకడా......సూక్ష్మంగా చెప్పాలంటే .... కొంచెం విచిత్రమైనవే.

"కొంచెం విచిత్రమైనవి అని చెప్పటం కూడా సబబు కాదు. పూర్తిగా విచిత్రమైనవే!

కళాశాలలో చదివే నన్ను "ఈ క్రాక్కా" అని నాతోటి విద్యార్థులు తరచు చెప్పుకునేవాళ్ళు. నాకు తెలుసు. అది ఒక విధమైన తిట్టులాగే నాకు అనుపించదు;—నా స్వభావాన్ని ఉన్న దున్నట్టు నిర్వచించే సాధారణమైన పారిభాషిక పదంగానే నేను దాన్ని ఆమోదించాను.

మొదట కొన్ని రోజులు—కొన్ని వారాలు అని కూడా చెప్పవచ్చు,— ఆమాట నా చెవిని పడితే నేను కోప్పడిపోతానని భయపడినట్టు, అది నా చెవిని పడకుండా వాళ్లల్లో వాళ్లే రహస్యంగా అనుకుంటూ నాకు తెలియకుండా దాచటానికి ప్రయత్నించారు. "క్రాక్" అని పిలిచినా లక్ష్యపెట్టని "క్రాక్" ని నేను,..... అన్న సంగతి వాళ్ళకు రోజులు గడచినకొద్దీ స్పష్టంగా తెలిసిపోయింది. "క్రాక్" అని, సానుభూతితో మాట్లాడేటప్పుడు "సెమి" అనీ నాకు వినబడేట్టు అనటానికీ, నన్ను పిలవటానికీ ఇప్పు డెవరూ జంకడం లేదు.

నేను కోపపడటం లేదు.

"క్రాక్" ఏమిటి? "సెమి" ఏమిటి? పిచ్చి ఏమిటి?

అన్నీ వట్టి మాటలు. మాటల్నిచూసి భయపడటం, కోపపడటం, బెదరటం నీడనుచూసి జడుసుకోటం లాంటిదని నా నమ్మకం.

లోకంలో భయపడటానికి ఇంకా చాలా విషయాలు ఉన్నయ్యే! వట్టి మాటల్నిచూసి భయపడ్డ మెందుకు?— అని నా మతం.

వట్టిమాటల్ని చూసి భయపడటం, వట్టి మాటల్ని దొర్లిస్తూ, సంతోషపడటం, పరవశత్వం పొందటం పిచ్చివాళ్ళ పని అని పిచ్చివాణ్ణైన నాకు అనిపిస్తూంది.

పిచ్చా? ఎవరికి పిచ్చి?

నాకా? లోకానికా?

కాని ఒకటిమాత్రం స్పష్టమే! లోకంలోవున్న తక్కిన వాళ్లల్లో— ప్రజలు అంటూ తిరిగేవాళ్లల్లో —ఎక్కువమంది లాగ లేను నేను. నేను సగటు మనిషిని కాను.

నేను వాళ్ళలాగ లేను అని చెప్పాలా? వాళ్ళల్లో ఎవరూ నాలాగ లేరు అని చెప్పాలా?......

దీన్నే నా మెదటి దురదృష్టంగా నేను భావించే సందర్భాలూ ఉన్నాయి.

ఇదే నా అదృష్టం, నా బలం అనుకొని నేను గర్వపడే సందర్భాలూ ఉన్నాయి.

## 3

నేను సన్నాయి పాట వినగానే చావు తలపులు నాలో ముసురుకుంటయ్యే, గుమికూడి గల్లంతు చేస్తయ్యే—అది నా అసాధారణత్వానికి ఒక్క నిదర్శనం మాత్రమే.

సన్నాయిపాట—పరవశత్వం—దుఃఖం—చావులు అనే వరుసలో నా ఆలోచనలు సాగితే నేనూ సాధారణ మానవుల్లో వాణ్ణేనని తేలిపోయేది. కాని, నా ఆలోచనలు అలా, ఆ వరుసలో సాగటం లేదు. ఆ వరస జ్ఞాపకం చేసుకొంటే కోపం వస్తూంది. ఎవరో చనిపోతే, ఇలా అంతా చేరి వూరంతా మారుమోగేట్టు సన్నాయి వూదనక్కరలేదనే నాకు అనిపిస్తుంది.

అనాథ ఒకతె, ముసిల్ది, దిసమొలతో చచ్చిపడివుంటే అందుకోసం లోకం పాడుతూ ఆనందించాలా?

కాని, ఈ నా కోపానికి ఆధారం కాని, పునాది కాని లేదని నాకు తెలుసు—నా ఎగుడు దిగుడు, వక్ర స్వభావంలో తప్ప వేరే ఎక్కడా ఏమీ ఆధారంలేదు.

లేచి నడవాలోకివచ్చి, ఆరోజు మేళ తాళ సంరంభమంతా ఎందుకోసమో తెలుసుకోవాలని ఇల్లూడుస్తూన్న పొన్నమ్మాళ్ ని అడిగాను. ఆమెను నేను "న్యూస్ పేపర్" అని పిలవటం పరిపాటి. ఎవరింట్లో ఏవి జరిగినా ఆమెకు తెలియకముందు వూళ్లో ఎవరికీ తెలియదనే మాట నిజం.

చిన్న కుర్రవాణ్ణి ఒకణ్ణి బళ్లో వేస్తారట! అందుకోసం ఈ మేళాలు, బాజాలూ, హంగామా.

అలాగే పరుగెత్తుకుపోయి నేను చదివి తెలుసుకున్న దంతా ఆ సందడిలోనే అందరికీ తెలిసేటట్టు చెప్పెయ్యాలి అనిపిస్తుంది నాకు. లోకంలో చదువుకొన్నవాళ్ళంతా ఎంత బుద్ధిహీనులుగా బ్రతుకుతున్నదీ, ఆ బాలుడు బడికి వెళ్లేనాటి ఆనందంలోనే వాడికి చెప్పెయ్యాలని నా కుతూహలం.

పిచ్చి ఆలోచనే ఇది!—కాదూ మరి?

సాధారణ మానవుడికి ఇలా అనిపిస్తుందా?

అసలు చదువుల నిరర్థకతే ఏమిటి—జీవితంయొక్క నిరర్థకతే ఆ సన్నాయి స్వరంలో ధ్వనిస్తూంది.

అందువల్లనే అది నాలో చావుని గూర్చిన ఆలోచనలు రేపుతూందేమో!

సన్నాయి వాద్యం చచ్చిపోయిన వాళ్ళకు మాత్రమే వాయించరు. ఆరోజు ఉదయం, ఆ సన్నాయి, ఆ డోలు వాద్యం ఢాం, ఢాం అంటూ ఏవేవో అపస్వరాలు వినలేక చచ్చిపోతున్న వాళ్ళ కోసం కూడా కలిపి మోగుతూన్నట్టుంది.

"చచ్చిన కళేబరాన్ని, చావబోతూన్న కళేబరాలు నాలుగు మోసుకుని...... " అనే తిరుమూలన్ సూక్తి జ్ఞాపకం వచ్చింది.

చాలా వారాల తర్వాత ఇప్పుడు తెలుస్తూంది. నా కోసమూ హేమతల్లికోసమూ మోగింది ఆరోజు వేకువ జామున ఆ సన్నాయి.

## 4

నాకు కథ చెప్పడం ఎప్పుడూ అలవాటు లేదు; అయినా— చస్తే కదూ శ్మశానం సంగతి తెలుసుకోవటం—నా కథ సరైన చోటునించే ప్రారంభంచేశా ననుకుంటా.

ఇది నేను వూహించి, లెక్క ప్రకారం ఏర్పాటుచేసి, కట్టు దిట్టాలతో చేసింది కాదు. ఎలాగో దాని కదే కుదిరింది.

ఆ కుర్రవాణ్ణి బడికి పంపిన రోజునే సాయంకాలం మా నాన్నగారు నన్ను హేమ ఇంటికి పంపారు. అదే నా నరక యాతనకు నాంది! హేమను నేను తలెత్తి చూసిన ఆ దినం ఆ సన్నాయి వాద్యంలోంచి ఉద్భవించింది. నా మనస్సులో అది నాటిపోయిన చావు తలపులలాగే చావుతో ముగిసింది అని కూడా చెప్పవచ్చునేమో!

డాంటే మహాకవిని చెయ్యి పట్టుకొని స్వర్గాన్ని పూర్తిగా త్రిప్పి చూపిందట ఫియాట్రిన్ అనే అతని ప్రియురాలు.

నా ప్రియురాలు నా సాన్నిధ్యంలో స్వర్గమనేది వేరేవుంది అన్న సంగతే మరచిపోయింది. లేకపోతే—ఆమెకూ్కడా దాని సంగతి తెలియదో! చెప్పలేను.

నరకంలోనే ఆమెతో చేయి చేయి పట్టుకొని తిరగ టంలో ఒక సుఖాన్ని నేను చవి చూచాననే అనుకుంటాను.

సుఖం ఎదురయ్యే స్థలాన్ని స్వర్గం అని చెప్పక నరకం అని చెప్పే నన్ను పిచ్చివాడనేకదా అనాలి!

నరకమే నా చుట్టూ ఉందనీ, నాకు చేజిక్కకుండా ఉన్నదే సుఖం అనీ— నా ఆలోచన నా చేతులు, కాళ్ళూ, వూపేసి హృదయంలో సుడిగాలి రేకెత్తించింది. సుఖ దుఃఖాలకు అతీత మైన ఒక పరిస్థితిని అందుకున్నాను నేను. పరబ్రహ్మగానో, పరమహంసగానో అయిపోవలసింది; అణువంతలో తప్పిపో యుంటుంది.

అందువల్లనే నా కథ చెప్పడానికి కలం పట్టుకుని కన్నె పడచులాంటి తెల్ల కాగితంముందు కూచున్నాను.

హేమ అందరిలాంటి కన్నెపడుచేమీకాదనే చెప్పాలి. మా నాన్నగారు కూడా, నాకు నచ్చని వ నిషే అయినా, ఆ రోజు నన్నాయన ఆమె ఇంటికి పంపింది ఈ ఫలితా లేవీ ఉద్దే శించికాదు.

నిజంగా ఆరోజున ఆ పిల్లను గూర్చి మా నాన్నగారికి ఏమీ తెలియదు. మాంబళంలో వెంకట నారాయణా రోడ్డులో ఏదో నంబరు ఇంట్లోకి తన స్నేహితుడు ఒకడు వచ్చి ఉన్నాడని, వారిని చూసి ఒక సమాచారం చెప్పేసిరమ్మనీ మాత్రమే ఆయన ఆరోజు నన్ను పంపారు.

## 5

బి. ఏ. రెండో ఏడు చదువుకొంటూన్న నేను, ఇలాంటి చిన్న పన్లు కూడా సరిగ్గా చేయలేని వాణ్ణి అని మా నాన్నకి తెలుసు. సాధారణంగా ఆయన నన్ను ఇటువంటి పనులమీద పంపేవారు కాదు. ఆయన ఏదైనా ఒకటి చెప్పి రమ్మంటే, ఆ ఒక్క ముక్కా మినహా తక్కిన అవసరంలేని తొమ్మిదింటినీ చెప్పేసి రాగల బృహస్పతిని నేను అని ఆయన గట్టి నమ్మకం.

"ఏరా ఇన్ని చెప్పావే! ఆ మాట కూడా చెప్పకూడదా?" అని ఆయన అడిగితే "అదే మరచిపోయా నాన్నా" అని అల వాటు ప్రకారం బదులు చెప్పేవాణ్ణి.

ఆరోజు వెంకట నారాయణా రోడ్డులో ఆ నంబరు ఇంటికి నన్ను పంపింది మా నాన్నగారు కాదు; నా విధిగాడనే చెప్పాలి.

కాని, విధి విలాసంలోనూ, అదృష్టంలోను అనివార్య మైన కార్య కారణ ఫలితాలన్నా అంతగా నమ్మకాలులేవు నాకు. ఇది మాత్రం, విధి వశం అనే చెప్పి తీరాలి. వేరే దారి లేదు.

కారణం హేమని గురించి ఆరోజు ఆ సందర్భంలో నేను తెలుసుకోవడం మొదలు పెట్టటం తప్పనిసరి, తప్పించ రానిది అనీ, దాని ఫలితమే నన్ను ఈనాటివరకూ, ఇక్కడి వరకూ లాక్కొచ్చిందని చెప్పి తీరాలి.

మాంబళంలో వెంకట నారాయణా రోడ్డులో ఆ నంబరు ఇంట్లోకి పోయి "సార్" అని పిలిచాను.

లోపల్నుంచి ఒక అమ్మాయి గొంతు "ఎవరది?" అని గదమాయిస్తున్నట్టు వినబడింది.

నేను వెదుక్కుంటూ వచ్చినాయన పేరు—ఏదో పుణ్య వశాన్న అప్పటికి మరచిపోలేదు నేను — చెప్పి, "ఆయన ఇక్కడే ఉన్నారా?" అని అడిగాను.

బదులు చెప్పకుండానే ఆ దబాయింపు గొంతుగలావిడ లోపల్నుంచి సింగారపు తెర తొలగించుకొని లోపలి ద్వారంలోంచి బయటికి వచ్చేసింది. నాజూకుగా, బాగా స్టైలుగానే ఉందన్న సంగతి, అలాంటివేమీ తెలియని నాకూ్కడా — ఆమెను చూచిన వెంటనే తెలిసింది. ఇంత సొగసుగా — ఒకేసారి కంటినీ, ముక్కునీ ఆకర్షించేలాగ ఒక పిల్ల ఉండవలసిన అవసరమేమి టని నాలో నేను ప్రశ్నించుకొంటూ నిలబడ్డాను.

## 6

"మీరా?" అన్నది ఆమె. నన్ను బాగా ఎరుగున్నట్టు.

తడబడి, "అవును, నేనే!" అన్నాను. మళ్ళీ ఇంకొకసారి ఆమెను తలెత్తి చూశాను. ముందు హాల్లో గోడకు తగిలించి వున్న కాలెండర్‌మీది సుందరిని చూశాను. మూడోసారిగా ఆమె ముఖాన్ని చూశాను.

నిజంగా ఆమెను నేను గుర్తించలేకపోయాను. అయినా నేను కూడా ఆమెను గుర్తు పట్టినట్టే, "నువ్వా!" అన్నాను.

వెనక జన్మలో ఆమె నాకు తెలుసా?

ఈ జన్మలోలాగే, అన్ని జన్మల్లో నా సహధర్మచారిణిగా ఉండి నావిడ ఈ పిల్లేనా?

ప్రేమ అంటూ చెబుతుంటారే, అది పూర్వ జన్మాల వాసనా?

"నువ్వా......ఎవరు?" అని అడగబోయి, "నువ్వా' అంటూ నిలిపేశానా?

ఈ విషయంలో ఏమి తీర్మానించుకోటానికీ పాలు పోవటంలేదు నాకు.

తెలివి తక్కువ ప్రశ్నలు అడగటం, తెలివిలేని మాటలు మాట్లాడటం అదేమొక కష్టమైన విషయం కాదు నాకు.

తారుమారుగా, దేన్నైనా, ఎందుకోసం చెబుతున్నానేది తెలియకుండానే, మాటల తికమకలో, కవిత్వంలాగ, పిచ్చివాడి ప్రేలాపనలాగ ఏదో చెప్పేయగలను. ఏమిటి? — ఎందుకోసం? — ఎలాగు? అనేవేమీ తెలియవు నాకు.

ఈ మాటలూ, ఈ పారవశ్యం, ఈ ధోరణీ, ఈ పిచ్చీ, ఈ తల తిరుగుడూ ఎక్కడికిపోయి ఎలా అంతమవుతాయో తెలియదు.

కాని, అదృష్టవశాత్తు అదే సమయంలో ఎవరో — ఆ అమ్మాయి తల్లే అయ్యుంటుంది......అని ఆమె ఆకృతిని, ముఖాన్ని చూస్తే తెలిసింది—లోపలికి వచ్చింది; "ఎవరే, హేమా?" అంటూ.

ఆమె పేరు హేమా? తల్లి హేమా అని పిలిచింది. పూర్తి పేరు హేమాంగిని అనో, హేమలత అనో, అయ్యుంటుంది. కలకత్తాలో ఎప్పుడో కొంతకాలం బెంగాలీవాళ్ళ మధ్య వుండి వచ్చిన కుటుంబమై వుంటుంది అనుకున్నాను.

## 7

హేమ తల్లితో చెప్పింది : "ఈయన నాతో మా క్లాసులో చదువుతున్నారమ్మా. రాము అంటారు. మామయ్య కోసం వెతుక్కుంటూ వచ్చారు.మా క్లాసులో నాల్గు సబ్జెక్ట్లలోనూ ఎప్పుడూ ఈయనదే ఫస్టు మార్కు" అంది.

"ఓహో! హేమ నాతో మా క్లాసులో చదివే అమ్మయా!" సరే........సరే!

అయితే నన్ను క్లాసులో వాళ్ళు "సెమి", "క్రాక్" అంటారని ఈమెకీ తెలిసుంటుంది. దాన్ని కూడా ఆమె తల్లితో నా ఎదురుగుండానే చెప్పెయ్యాలిసిందే! నాకేలాంటి అభ్యంతరంలేదు. కాని ఆమాట తర్వాత చెప్పవచ్చులే అని పూరుకుందేమో!......పోనీలే!

నా పిచ్చి చేష్టలు ఆమెకి కొత్తగా కనిపించే అవకాశం లేదులే అన్న వూహ నాకు ఉపశమనం కలిగించినట్టుంది.

"ఎవరు నువ్వు?" అనే ఆమెను అడిగేసి, తెలివి తక్కువ వాణ్ణి అనే గౌరవం పొందలేదు ఇక్కడ!—అంతవరకూ మంచిదే అయిందనుకున్నాను. క్రాక్ లాగ ప్రవర్తించటానికి నాకు ఎట్టి అభ్యంతరం లేదు. పిచ్చివాళ్ళ లోకంలో పిచ్చివాడు అంటే పిచ్చి లేనివాడనే అర్థం. కాని తెలివి తక్కువవాణ్ణి అనే గౌరవానికి తగినవాణ్ణి అనిపించుకోటం మాత్రం నాకుఎప్పుడూ ఇష్టంలేదు.

నేను వెదుక్కుంటూ వచ్చింది ఆమె మామట! మా నాన్నగారి స్నేహితుడు. ఆవేళ, ఆయన ఇంట్లో లేడు. ఎక్కడికి పోయాడో తల్లికీ, కూతురికీ తెలియదు. ఆయన వచ్చే వరకు నేనక్కడే ఉండవచ్చునని— ఎలాగూ అరగంటలో వచ్చేస్తాడనీ చెప్పింది హేమ తల్లి.

అక్కడే ఉండవలసి వచ్చింది.

వేరే ఎక్కడో ఏదో పనుందని చెప్పేసి పోయుండవచ్చు. కాని, ఆవేళకి నా వూహ అంత చురుగ్గా పని చెయ్యలేదు.

ఇప్పుడు ఆలోచించి చూడగా, అసలు నాకు అలా వెళ్ళిపోవటం ఇష్టం లేదేమో అని కూడా తోస్తూంది.

నాకే స్పష్టంగా తెలియడం లేదు.

"నువ్వా" అని హేమను బాగా తెలిసిన వాణ్ణిలాగ ప్రశ్నించిన నేను, ఆ ఇంటికి బాగా పరిచితుణ్ణిలాగ, హేమతల్లి చూపిన కుర్చీలో బుద్ధిమంతుళ్ళాగ కూచుని పోయాను.

## 8

హేమ, తన గదిలోకి బయటి వరండాలోకి కారణమేమీ లేకుండానే వస్తూ పోతూంది. ఇలా, కనబడుతూనే మాయమయ్యే అలవాటు మా చెల్లాయి రుక్కు క్కూడా వుంది. అలాంటప్పుడు రుక్కుమీద నాకు కోపం వచ్చేది. "పోవే! నా ఎదటికి రాకు" అని అరిచేవాణ్ణి.

హేమలాగే, జడను వేళ్ళతో తిప్పుకొంటూ "ఏమిటన్నయ్యా! ఏమిటంటున్నావ్?" అంటూ నా ముందుకు వచ్చి నిలబడేది రుక్కు.

హేమ చేష్టలు, నాకు తెలీకుండానే నాకు నచ్చుతున్నయ్. కోపం రావటానికి మారుగా నాకు ఏదో మనశ్శాంతి కలుగుతూంది.

గదిలో వెచ్చగా ఉంది. నేను కూచున్న సీటు మాత్రం మెత్తగా, సుఖంగా వుంది.

ఫ్రాయిడ్ అనే మన స్తత్వ శాస్త్ర నిపుణుడు వూహించి నిర్వచించిన ఒక విజ్ఞాన సూత్రం నాకు జ్ఞాపకం వచ్చింది. "మానవులుగా జన్మించిన వాళ్ళందరికీ మృదువైన, సుఖమైన, స్థిమితమైన మాతృ గర్భకోశపు జ్ఞాపకాలు ఎన్నటికీ పూర్తిగా వదలిపోవు—అలాంటి సుఖంకోసమే మానవులు ఎప్పుడూ ప్రయత్నిస్తూంటారు—ప్రతి పనీ అందుకే చేస్తారు" అంటాడు ఫ్రాయిడ్.

అది నిజమేనేమో!

ఆ గదీ, ఆ సీటూ నాకు అర్థంకాని, ఆ ఫ్రాయిడ్ సిద్ధాంత రీత్యా నేను జ్ఞాపకం ఉంచుకొన్న, నా తల్లి గర్భకోశ సుఖాన్ని నాకు జ్ఞాపకం చేసి ఉండొచ్చు.

వెచ్చదనం, మెత్తదనం, హేమ తల్లి మాతృత్వం ఇవన్నీ ఆ క్షణంలో అదో స్వర్గం అనిపించింది నాకు.

స్వయంగా ఏదో చేస్తూ, అవస్థ పడనక్కరలేని పరిస్థితి అది. అనుభవింపదగ్గది.

స్తబ్దంగా ఉండటంలోని సుఖాన్ని తాయుమాణవర్ యోగిలాగ నేనూ అనుభవంలోకి తెచ్చుకున్నవాణ్ణే.

హేమ రెండు మూడుసార్లు లోపలికి వెళ్ళి వచ్చి, చివరకు నా పక్కన ఉండే సోఫాలో కూచుని ఏదో అంది. గువ్వ నోరు

లాంటి ఆమె అందమైన నోటిని తెరుస్తూ మూస్తూండటం చూస్తూ, ఆమె ఏం చెప్పిందో వినకుండానే, ఆనందంగా, పరబ్రహ్మ స్వరూపంలాగ కూచున్నాన్నేను.

ఏ కాలేజి అమ్మాయిమాత్రం అర్థవంతమైన విషయాలు ఏం మాట్లాడగలదు?

## 9

నా జవాబుకోసం ఆమె ఎదురు చూసినట్టు కూడా లేదు. నా చెల్లెలు రుక్కు విషయంలో కూడా ఇది గమనించాను. రుక్కు గంటలకొద్దీ మాట్లాడుతూంటుంది; తను చెప్పేది నేను వింటున్నానా, లేదా, అన్న ఆలోచనే లేకుండా.

హేమనూ, నా చెల్లెల్నీ నేనెందు కిలా మాటి మాటికి, పోల్చి చూస్తున్నానో నాకే తెలియటంలేదు. నా చెల్లెలు పదిహేను, పదహారు సంవత్సరాలుగా నా దగ్గిర ఉన్నది. హేమ అనే ఈ అందమైన పిల్ల నాతో రెండు మూడేళ్ళు చదివిందికాని, ఆమె పేరు కూడా నాకీ రోజువరకు, పావుగంటక్రితం వరకూ తెలియదే!

హేమ అనే ఈ అమ్మాయి ఎవరు? చదువులో ఈపిల్ల ధోరణి ఎలాంటిదో నాకు తెలియదు. క్లాసులో నా కళ్ళు ఆడపిల్లలు కూర్చున్న వేపు ఎప్పుడూ చూసిన పాపానపోలేదు......

స్త్రీని గురించిన జాగ్రుతి నాకింకా, ఈ రోజువరకూ కలుగలేదు. డబ్బిచ్చి కొన్న అనుభవం ఒకటుంది. కాని దాన్ని నిజంగా స్త్రీ సంబంధం అనీ, జాగృతి అనీ అనలేం కదా!

నా దృష్టిలో ఆడవాళ్ళు దేవతలూ కారు. రాక్షసులూ కారు.

పావు గంటయింది. అరగంట కూడా అయింది. హేమ మామగారు తిరిగి రాలేదు.

హేమతల్లి బయటికివచ్చి ఎదురుగుండా వున్న సీటులో వొయ్యారంగా కూచుంది.

''విశ్వనాథం త్వరలోనే వచ్చేస్తాడు'', అన్నది.

''రానీండి!'' అన్నాను నేను.

నా కెందుకో ఆ గది వెచ్చదనం, పొత్తి కడుపులో వెచ్చదనంలాగ హాయిగా ఉంది. అది అలాగే ఎప్పుడూ వుంటే బాగా ఉండుననిపించింది. అరే! ఆ విశ్వనాథంగారు వస్తే చెప్పేసి, నేను లేచిపోవాలే!

వూరికే కూచోటమే సుఖం అనే నమ్మకం వున్నవాణ్ణి నేను.

''మా అమ్మాయి మీరు చాలా గట్టివాళ్ళని చెప్పింది. మీరేమీ ఏమీమాట్లాట్టంలేదే!'' అన్నది హేమతల్లి.

నేను గట్టివాణ్ణని హేమ వాళ్లమ్మతో చెప్పిందన్న మాట! ఎప్పుడు చెప్పిందో......తెలీదు. పోనీ.

''మౌనంగా ఉండటానికి అలవాటు పడినవాణ్ణి చూస్తే సాధారణంగా అందరూ గట్టివాడని గౌరవిస్తారు!'' అన్నాను.

''నిజమే!'' అన్నది హేమ తల్లి, ''నిజం'' తనకి తెలిసినట్టు.

ఆ క్షణం, ఆమె ''నిజమే'' అని చెప్పిన క్షణంనుంచీ, ఆమెపట్ల నా కసహ్యం కలిగి అది పెరగడం మొదలెట్టింది నాలో.

నా మాటలకి తలూపే వాళ్ళని చూస్తే, నా కెప్పుడూ అసహ్యం.

## 10

నాకు ఎదురు చెప్పకుండా, అవునవునంటూ నేను ఏం చెప్పినా తలూపేవాళ్ళు, రహస్యంగా నన్ను గోతిలో దింపేయడానికి సిద్ధంగా ఉన్నారన్న సందేహం ఒకటుంది నాకు.

ఇది కూడా నా అసాధారణ గుణాల్లో—నా పిచ్చి ధోరణుల్లో ఒకటి కావచ్చు.

నేను పిచ్చివాణ్ణే అన్న సంగతి ఆలోచిస్తే నా క్కూడా అర్థమవుతూంది. అందుకే, ఇతర్లు నన్ను పిచ్చివాడు అన్నప్పుడు నాకు కోపం రావటం లేదు.

పిచ్చివాణ్ణిగా ఉండటానికి కూడా నాకు హక్కుంది.

ఆ హక్కు నీకులేదు, అని ఎవరైనా చెబితే నాకు నిజంగా కోపం వస్తుంది. నా హక్కుని దేన్నీ పోగొట్టుకోలేను నేను.

ఇతర్లు నన్ను గురించి ఎప్పుడేమనుకొంటారో అని సందేహిస్తూ, అడుగడుగునా 'జంకే' స్వభావం కాదు నాది.

నా మనస్సులో అలల్లాగ పైకి లేస్తూ పడుతూ పోయే ఆలోచనల్ని, చివరి వరకూ వెంటాడి తేల్చేసుకోడానికే నాకు ధైర్యం, మనోబలం, ఉత్సాహం, వ్యవధీ— చాలడంలేదు. అసలు ఇతర్లేమనుకొంటారో, ఆలోచిస్తూ కూచోటానికి నాకు తీరిక ఎక్కడిది? అంత మన స్థిమితం కూడానా?

ఈ పెద్దెనిమిదేళ్ళల్లో ఒకటిమాత్రం నిశ్చయించుకొన్నాను. లోకంలోవున్న ఇతరు లందరిలాగా సగటు మనిషిగా ఉండ గలిగితే, అదేమంచి—అదే సులభమైనది—అదే సౌఖ్యమైంది అని తీర్మానించుకున్నా; అలా ఉండటానికే తంటాలు పడుతున్నా.

వీలుపడటంలేదు.

నలుగురూ నడిచే నలిగిపోయిన బాటలో, అందరికీ అర్థమయే రంగంలో, గొర్రెల్లాంటి మనుష్యులమధ్య నేనూ ఒక గొర్రెలాగ, ఎవరికీ ప్రత్యేకంగా కనపడకుండా, ఏవిధంగానూ ఎవరి దృష్టినీ ఆకర్షించకుండా, వున్న జాడ తెలియకుండా జీవితం వెళ్ల బుచ్చేయటం మంచిది.

అది తెలియక మనుష్యులు స్మారక చిహ్నాలు నిర్మిస్తూంటారు! పాపం!

నది గట్లన్నీ బురదగానే ఉంటవి. స్మారక చిహ్నాలన్నీ విస్మృతినే సూచిస్తూంటవి. వాటి ఎదుట నిలబడి చూట్టానికే ఎవరికీ ఉత్సాహం లేదు.

కష్టపడకుండా, ఎవ్వర్నీ రోష్టు పెట్టకుండా కులాసాగా రోజులు గడుపుతూ చనిపోయినవాడే గొప్పవాడు.

## 11

ఇతరులందరిలాగ ఉండటం, ఆలోచించటం చేతకాని వాడు ఏకాంతాన్ని కోరుతూ, అడవుల్లో మృగంలాగ, లేదా ఋషి లాగ బతకడం మంచిది. లోకంలో తలెత్తుకు తిరుగటం తప్పే అనుకుంటాను.

నాలాంటివాడు, మనుష్యుల్లో మనిషిని అని చెప్పుకొంటూ ఇతర్లను మోసం చేస్తూ, మనస్సులో మాత్రం అడవి మృగం లాగ బ్రతకడం తప్పే అనిపిస్తూంది. తప్పు అనడమేకాదు. అలా జరగడానికి వీల్లేదనే చెప్పాలి. నా ఒక్కడి విషయంలో మాత్రమే ఇది సంభవం అనుకుంటూ మోసపోవడం తప్పు.

"నోరు మూసుకుని ఉండటమే గట్టి వాడి లక్షణం" అన్న ధోరణిలో హేమతల్లికి జవాబిచ్చి తెలివిగా తప్పించు కున్నాను. అదిసరే, కాని, "గట్టివాడికి లక్షణం ఆలోచించకుండా ఉండటమే" అని చెబితే మాత్రం ఎవ్వరూ ఒప్పుకోరు.

ఎందుచేత?

ఆలోచనలకు అంతం ఎక్కడ?

మానవుల ఆలోచనల్లో దేనికీ అంతంలేదు అన్నదే ఉదాత్తమానవభావన.

బుద్ధుడు, సోక్రటీసు, కన్ఫూషియసు, జొరత్రుష్ట్రుడు, శంకరుడు—వీరందరికీ తర్వాత కూడా, ఇంకా ఆధ్యాత్మిక చింతన అన్నది మానవులకు అవసరంగానే ఉంది.

ఉదాత్తభావాల్ని కట్టిపెట్టి, మానవ సంతతికి "భావ విటమిన్లు" కనిపెట్టి పంచి పెట్టటానికే ఎందరో మహాను భావులు ప్రయత్నం చేశారు.

టానిక్కులు తాగి స్వాస్థ్యం సంపాదించినవాడులేడు.

టానిక్కులు రోగికి అవసరం కావు. కాని, డాక్టర్లకు — వారు బదకడం కోసమే కావాలి అవి.

నాకు జాతకమన్నా, జోస్యమన్నా నమ్మకం లేదు. కాని నా జాతకం ప్రకారం, నా యాభై రెండో సంవత్సరంలో నేను లోకానికి గురువు నవుతానని మా నాన్నగారు గర్వించేవారు.

లోకంలో గురువులెందరో వచ్చిపోయారు. నిజమే. కాని లోకం ఇంకా లోకంగానే ఉంటూంది.

ఈ గురువుల్లో చివరివాణ్ణి కాగలిగితే నాది గొప్ప అదృ ష్టం అనే చెప్పాలి. కాని, నా తర్వాత కూడా లోకంలో గురు వులు కావాలి కదా!

ఈ వివరాలు నా జాతకంవల్ల మా నాన్నగారికి ఏమీ తెలిసినట్టులేదు.

## 12

నా యాభై రెండో ఏడు ఇంకా చాలా దూరం ఉంది. లోకంలో ఎన్నో వ్యాధులున్నాయి; పొడుచుకునే కత్తు లున్నాయి; భూకంపాలున్నాయి; ఈగలు, దోమలు, క్రిములు, ఉన్నాయి; రాజకీయ నాయకులున్నారు; ప్రభుత్వాలు, పార్టీలు ఉన్నాయి; అణు, హైడ్రోజను బాంబులున్నాయి; ఇన్నింటినీ దాటి ఈ వేళకి పందొమ్మిదేండ్లు నిండని నేను, యాభై రెండో సంవత్సరందాకా ఉండాలి గదా!

ఉంటే చూసుకుందాం!

ఉండగలను అనే, ఏదో స్ఫురణ నాకూ లోలోపల కలుగుతూంది.

ఇవన్నీ మాత్రమే కాదు. ఆకలి, వస్తులు అన్నింటినీ దాటి, బ్రతుకు పోరాటంలో రోజూ ఏర్పడే గండాల్ని, గందర గోళాలనీ దాటి మన్నగలననే, మనస్సు లోలోపల చెబుతూంది.

మనస్సులో కలిగే ఈ స్ఫురణ, మొత్తం ప్రపంచానికే, మానవ జాతికే స్వాభావికమైనది. అగ్నిపర్వతం చరియల్లో కూడా ఆశతో జీవించగలవాడే మానవుడు.

కాని......కాని......

దేన్ని వదిలైనా బ్రతకొచ్చు.

ప్రేమ అనే చావులో జీవించటం సాధ్యం కాదు.

అప్పుడే కదా అది ప్రేమ!

"నువ్వా?" అని హేమను, నాకు నమ్మకంలేని పూర్వ జన్మ వాసనతో, గుర్తించి, ప్రశ్నించటంతో నాలో ప్రేమోదయ మైందనే తీర్మానించుకొన్నాను.

పిచ్చి పిచ్చి ఆలోచన్లు నాకు కొత్తవి కావు. కాని, ఈ ప్రేమ అనే భావన మాత్రం కొత్తదే.

మూడేళ్లుగా నాతో, నేను గట్టి వాణ్ణి అని నమ్ముతూ చదువుతూన్న హేమపై ఈరోజు చూచిందే తడవుగా నాకు ఎందుకు ప్రేమ కలగాలి? అని నన్నే ప్రశ్నించుకొంటూ అలాగే సోఫాలో కూచున్నాను.

హేమ తల్లి నేను చెప్పింది నిజమే అని ఒప్పేసుకొన్న ప్పటి నా కోపావేశంకూడా కొన్ని నిమిషాల్లో మాయమై పోయింది.

ఏదో సుఖంగా ఉన్నట్టూ, పరవశత్వం కలుగుతున్నట్టూ ఒక జ్ఞాపకం మాత్రం ఉంటూనే ఉంది.

ఆ పరవశత్వం తాలూకు జ్ఞాపకాన్ని పొడిగించుకుంటూ, కల్పాలు, యుగాలు— ప్రళయకాలందాకా బ్రతికెయ్యొచ్చు అనిపించింది.

హేమని తలెత్తి చూశాను. ఆమె చిన్న చిన్న పదునైన పళ్ళ వరుస, కొబ్బరి కోరులాగ కనిపించింది. పై పెదవిమీద ఏర్పడిన చెమటముత్యాలు ఆమె కూడా ఏదో అసాధారణమైన భావంలో పడిపోయిందని సూచిస్తూన్నాయి.

"ఇల్లు వెతుక్కుంటూ వచ్చేశాడు. తప్పించుకుపోనివ్వ కూడదు" అనుకుంటూందా ఆమె? లేకపోతే......

"ఇల్లు వెతుక్కుంటూ వచ్చేశాడు. నేను తప్పించుకోటం ఎలాగ?" అని గొడవ పడుతుందా?

ఆమె ఎలా అనుకుంటే మంచిది అన్న విషయం నాలో నేను, ఎటూ తేల్చుకోలేకపోయాను.

## 13

ఆమె స్త్రీత్వ స్వరూపంగా, అందమే ఆమెగా కనిపించింది నాకు. అయినా, ఆమె ఏమనుకుందో......నా కెందుకు ఆ విచారం, అన్నది నాకు తెలుసు. చెబుతాను. నన్ను గురించి ఆమె ఏమనుకుంటే నా కెందుకు అని, ఆమె అందంగా ఉందని తెలుసుకున్నప్పుడే నేను అనుకోగలిగాను. ఈ విషయం నా మట్టుకు ప్రత్యేకమైన, విశిష్టమైన ఒక మనః పరిపాకంగా నాకు తోచింది.

నేను ఇతరుల్లాగ లేను అనటాని కిది ఇంకో ఉదాహరణ. నేను ఎవరితోను కలవని ఒంటెత్తువాణ్ణి అనటానికి ఇంతకన్నా మంచి ఉదాహరణ వేరే అక్కర్లేదేమో!

ఇలా ఉండటం నా కిష్టమా అన్నది వేరే విషయం. ఇందులో నా ఇష్టానిష్టాలు ఏమాత్రం గమనించకుండా, నన్ను ఒంటరి వాణ్ణిగా చేసేసిన దురదృష్టపు విధి, దురదృష్టపు మనస్స్థితి, దురదృష్టపు దైవం — ఏ పేరు పెడితే ఏం? నా శక్తికి మించిన దేదో — నన్ను వేరుగా వుంచి, మళ్ళా ఆ వేరుబాటుతనాన్ని నేను బాగా గ్రహించేటట్టు చేసి, తమాషా చూస్తోంది.

తమాషా చూట్టం నాకూ ఇష్టమే. మవుంట్‌రోడ్డులో సాయంకాలంవేళ జనం గుంపులు, గుంపులుగా పడుతూ లేస్తూ తోసుకొంటూ, తొక్కుకొంటూ పోతూండటం చూస్తూ, గంటలకొద్దీ వారగా నిలబడి చూట్టం నాకు ఇష్టమే. సినిమా చూడ్డం ఇష్టం లేదు నాకు—దీన్ని మించిన సినిమా లేదు నాకు — గంటలకొద్దీ అలా చూస్తూ నిలబడ్డాను ఎన్నో సార్లు.

ఏదీ పట్టించుకోనట్టు, అంటి ముట్టనట్టు ఉండటం వేదాంతుల ధోరణి అంటారు!

పూర్తిగా, ఏదీ పట్టించుకోకుండా ఉండటం నాకు చాత నవటం నాకు గర్వమే.

వయస్సులో ఉన్నవాడొకడు—సైకిలువాడు —దయ్యం లాగు వచ్చిపడ్డ ఒక లారీక్రింద పడిపోయాడు. పదడుగులు ముందుకువేసి చూస్తుంటే, ఆ ఘోర దృశ్యం రక్త మాంసాలతో సహా నాకు కనబడేది. పోలీసులు బిగిళ్ళు వూదేరు; గుంపు చేరింది; అయ్యొయ్యో! ప్చ్! ప్చ్! అన్నారు ఒక ఐదుమంది; సైకిలువాడిదే తప్పంతా అని వాదించారు కొందరు. ఆంబులెన్స్ వచ్చింది. "ఆ సైకిలువాడు బతుకుతాడా సార్? " అంటూ వాడి ప్రాణం పోయిన గంటన్నరసేపు తర్వాత, రోడ్డమ్మట పొయ్యేవాళ్లు జాలిగా అడిగారు.

నేను ఉన్నచోటునుంచి కదల్లేదు.

చావుని గురించి, జీవితాన్ని గురించి నా కంతా తెలును. ఏదీ నన్ను కదిలించదు అన్న గట్టి నమ్మకంతో కాళ్ళను వున్న చోటే గట్టిగా నిలదొక్కుకుని కదలకుండా, చెట్టులాగ నిలబడ్డాను.

ఏం జరిగేదీ, ఎలా జరిగేదీ, ఎందుకు జరిగేదీ నాకు తెలిసినట్టే ఉంటుంది కొన్ని సమయాల్లో.

ఈ జ్ఞానంమంచి పారిపోవటానికి ప్రయత్నించాను నేను. ఈ జ్ఞానానికి, అచంచలత్వానికి పర్యవసానాలన్నీ నేను అనుభవించాలి.

తప్పించుకోలేను. తప్పించుకోను.

ఎమర్సన్ అన్నది నిజం. నే నెక్కడికి వెళ్లినా, నన్ను ఏ జైలులో బంధించినా సరే! — నా ఆలోచనల కొరడా, నా జ్ఞాపకాల కమిచీ నన్ను వెంట తరుముకొస్తాయి. చెళ్, చెళ్ మంటూ నాకు తగిలే కొరడా దెబ్బలు అవి.

## 14

కాలం ఒక కసాయి మనిషి.

ఆ కసాయి కమిచీ దెబ్బలు భయంకరమైనవి. ఆ కొరడా దెబ్బలు నొప్పి కలిగించవనే లోకం నమ్ముతూంది. నమ్మటానికి నాకూ అభ్యంతరం లేదు.

కాని, నాకు నొప్పిగా ఉందే! — నేనేం చెయ్యను?

ఆలోచనల కొరడా దెబ్బల్ని అలక్ష్యం చెయ్యొచ్చు. నేను ఆలోచించటమే మరిచిపోవచ్చు కూడా. అంటి ముట్టకుండా ఒదిగి ఒదిగి బ్రతుకుతూ, వైదొలగి ఉంటున్నాననుకోకుండానే గడిపేస్తూ ఉండొచ్చు.

అడవులకు పారిపోవటం నాకు ఇష్టంలేదు. అడవిమృగం మాదిరిగానో, మహాఋషిగానో బతకాలని నాకులేదు. యాభై రెండో సంవత్సరంలో లోక గురువు నౌతానని నా జాతకం చెపుతూందంటే—దాని సంగతి లోకమే చూసుకోవాలి — లేకపోతే చూసుకోక నశించిపోయినా సరే! దాన్ని గురించి, ఆరోజు వచ్చే వరకూ నేను ఆలోచించను.

ఈ పద్దెనిమిదో సంవత్సరం, కాలేజీ విద్యార్థిగా, బి. ఏ. క్లాసులో రెండో ఏడు గడుపుతూన్న నేను సాధారణమైన యువకుణ్ణిగా, ఇతర కాలేజీ విద్యార్థులందరిలాగ, విద్యార్థిగా ఉంటమే నాకు ఇష్టం. విద్యార్థినులను చూసి ఈలలువేస్తూ, మూడు గంటల సినిమాకి పంద్రెండు గంటలకేపోయి క్యూలో నిలబడుతూ, డబ్బులు పెద్దవాళ్లు ఇచ్చుకొంటారు మన కెందుకూ విచారం అనుకుంటూ నిశ్చింతగా బ్రతకాలనే నాకూ వుంది.

నే నలా ఉండలేను గనుక, లోకానికే ఏదో పెద్ద నష్టం కలుగ బోతూంది అని నాకు మాటి మాటికీ అనిపించేది.

నేను ఎన్నడూ సినిమాకువెళ్ళి పంద్రెండు గంటలకే క్యూలో నిలబడలేదు అని చెప్పలేను. నిలబడ్డాను, ఒకసారి. కాని పంద్రెండు గంటలనుంచీ రెండూ యాభై యైదు నిమిషాల

వరకూ నిలబడి, ఇక ఐదు నిముషాల్లో టిక్కెట్లు కిటికీ తెరుస్తారనగా, క్యూలోనుంచి బయటికి వచ్చేశాను. నా ముందున్న నలుగురూ, నా వెనకాలవున్న నలుగురూ "అరే పిచ్చివాడు" అని కళ్లతోనే నవ్వేశారు.

అవును. తీరా కిటికీ తెరిచేటప్పుడు బయటి కొచ్చేసిన నేను పిచ్చివాణ్ణే. కాని ఆరోజు సినిమా చూసిన వాళ్ళు కూడా అంత గొప్ప బుద్ధిమంతులేమీకారు. పోస్టర్లలో తప్ప, వేరే ఎక్కడా ఎలాంటి గొప్పతనంలేని పిక్చరని, పిక్చరు చూసిన వాళ్లకే గదా తెలిసేది!

## 15

హేమ మామగారు తిరిగి వచ్చేస్తారు, వచ్చేస్తారు అనుకొంటూ నేను ముప్పావు గంటకుపైగా అక్కడే కూచున్నాను. సినిమా క్యూ కాదది. తల్లి గర్భకోశ సుఖాన్ని తలపుకి తెచ్చే వెచ్చని బంగళావసారందు గదిలో, మెత్తని పరుపు వేసిన సోఫాలో అలాగే కూచున్నాను. నేను నా తల్లి గర్భంలో జన్మించటానికి సిద్ధంగా ఉన్నట్టు, ఉన్నదని......చెప్పవచ్చునా?

ఏవిధంగానయినా చెప్పవచ్చు. ఈనాడు ఫ్రాయిడ్ ప్రభృతి మనస్తత్వ నిపుణులు ఏది కావలసినా చెప్పడానికి వీలుండేటట్టు చేసేశారు.

మానవుని ఆత్మ దేహం అన్న వల్లో చిక్కుకుని, మాయ అనే దిక్కు తెలియని అడవిలో తిరుగులాడడం, నిజమో కాదో నాకు తెలియదు, వేదాంతులక్కూడా నిశ్చయంగా తెలియదు. మనం రోజు రోజూ మాటల వలత్రాళ్ళలో చిక్కుకొని, తికమక పడుతున్నాం అని మాత్రం నాకు తెలుసు.

సానుతాపం, అనుభవం, ప్రేమ, దయ, కరుణ, ఆత్మ, వల, మనస్సు, ప్రపంచం అన్నీ మాటలేగా!

పెద్ద పెద్ద మాటలు నేర్చిన దోషం, నేనూ వాటన్నింటినీ సరళంగా, సులభంగా వాడేస్తాను. ఆ మాటల్లోవున్న సంపూర్ణమైన అర్థాల్ని, అంతరార్థాల్ని తెలుసుకోడానికి నాకున్న జ్ఞానం చాలదు, — అనుభవం చాలదు, — వయస్సు చాలదు, ఉత్సాహం చాలదు.

నన్ను గురించీ, నా మనస్సును, ఆత్మని, నా ఆలోచనలను గురించీ, నా ఆలోచనల ప్రత్యేక ధోరణిని గురించీ నాకు ఎంత వరకూ నిశ్చయంగా తెలుసు? నిజంగా నాకేమీ తెలియదు అన్నదే నిజం. మిగిలిన వేవీ నిజాలు కావు.

తీవ్రంగా ఆలోచించిన తర్వాత, ఏమీ తెలియదు అనే తీర్మానానికి రావటానికి ఇంతదూరం ఆలోచించటం ఎందుకు? ఆలోచనలే శుద్ధ దండుగ అని సాధారణ మానవులందరిలాగ, — లక్షమందిలో ఏ ఒకడో తప్ప — ఉండిపోవటం మంచిది కాదా?

అదే, ఆ విద్య ఒక్కటే నాకు అలవడటం లేదు.

హేమ తన తల్లితో చెప్పిందిగా ఆ మాటే! నేను కళాశాల చదువుల్లో గట్టివాణ్ణే. బి. ఏ. పరీక్షకోసం నేను ఎన్నుకొన్న నాలుగు సబ్జెక్టుల్లోనూ క్లాసులో నేనే ఫస్టు. సులభంగానే ఫస్టు మార్కు లొచ్చేవి. అంత జాగ్రత్తగా చదివినానని కూడా చెప్పలేను. నా ప్రయత్నం ఎక్కువ లేకుండానే ఫస్టు మార్కులు సంపాదించాను.

ఆ విషయంలో మా నాన్నగారికి, నా క్లాసు ప్రొఫెసర్లు అందరికీ పూర్తిగా తృప్తే!

నా కా తృప్తి లేదు. అది చాలదు; ఇది వట్టి మోసం; గారడి అనే భావన నాలో ఘోష పెడుతూంది; పెడుతూనే ఉంటూంది.

## 16

హేమ ఆ యాభై యైదు నిమిషాల్లో వో ఐదు నిముషాలైనా ఎడతెగకుండా ఏదో మాట్లాడుతూనే వుంది.

ఏం మాట్లాడిందీ అంటే నాకు తెలియదు. ఆమె మాటల్లో దేన్నీ నేను సరిగా వినిపించుకోలేదు. ఒక్కడొకటి ఇక్కడొకటిగా నా చెవిలో పడిన మాటలు, నా ఆలోచనల్ని రేకెత్తించినయ్యే తప్ప, ఆమెకు జవాబు చెప్పడానికి నన్ను ప్రేరేపించలేదు.

ఆడవాళ్ళు అదృష్టవంతులు. వాళ్ళ నోళ్లు ఎంతకీ అలసిపోవు. వాళ్లకి ఆలోచించవలసిన అవసరం తక్కువ.

హేమను మాత్రమే చూస్తూ కూచున్నాననీ చెప్పలేను. మా ఇద్దర్నీ ఒంటిగా వదలిపెట్టి పోకూడదు అనేమో, అక్కడికి వచ్చి కదలకుండా కూచుని ఉండిన ఆమె తల్లిని కూడా మాటి మాటికీ తలెత్తి చూస్తున్నాను.

చీకటి పడిన తర్వాత లేచి అరవై వాట్ల లైటు వేసింది హేమ. హేమ తల్లి వెనుకపక్క బ్రహ్మాండమైన నీడ లేచింది: ఏదో రహస్యాన్ని, వింతైన అడవి మృగాన్ని, దుప్పటితో కప్పినట్టు, చీకటి గుట్టలాగ ఆమె నీడ, ఆ అందమైన గోడమీద పడింది. హేమతల్లి కన్నా ఆమె నీడ నా మనస్సును ఆకర్షించి అలజడి పెడుతూంది.

సన్నాయి పాటలో చావు కేక చెవి యొగ్గి వినే నేను, చీకటిలో ఆకర్షణను పసికట్టానంటే ఆశ్చర్యమేముంది! అందమైన, వయస్సు ముదురు తూండిన, ఆకర్షణీయమైన ఆడదానికంటే, ఆమె నీడే అందమైనదిగా, కాలం తాకిడికి లొంగనిదిగా, ఆకర్షణీయమైనదిగా కనిపించింది నాకు.

అందులో ఆశ్చర్యం ఏమీ లేదు.

ఇటువంటి కార్య కారణ సంబంధం ఏదీ లేకుండానే ఆలోచనల్లో పడి కొట్టుకు పోవటానికి అలవాటు పడినవాణ్ణి నేను. అందువల్లనే ఇతరుల్లాగ ఉండటం నాకు చాతనవడం లేదు; మాట్లాడటం చేతకావడంలేదు; ఆ సంగతి కూడా నాకు తెలుసు.

నేను పిచ్చివాణ్ణే! అందులో నాకేమాత్రం సందేహం లేదు. కాని, లోకంలోవున్న ఇతరులు కూడా పిచ్చివాళ్లేనేమో అనే అనుమానం నాకొన్ని సమయాల్లో కలుగుతూంటుంది.

కాని ఈ ఆలోచన కూడా నాకు తృప్తినిచ్చే బాపతు కాదు.

పిచ్చివాళ్ల లోకంలో భిన్నమైనవాణ్ణిగా ఉండటం, పిచ్చి లేని లోకంలో భిన్నమైన వాణ్ణిగా ఉండటం చివరికి ఒకటే కదా?

నే నొక్కణ్ణే పిచ్చివాళ్ల లోకంలో చిత్త స్వాస్థ్యంతో వున్నవాణ్ణి అనుకుంటే, అదీ తప్పే కదా అని నన్ను నేను మంద లించుకునేవాణ్ణి.

## 17

ఏడున్నర కొట్టగానే, ఏదో మాయలోంచి విడి వడ్డ వాడిలాగ లేచి నిలబడ్డాను.

గోడ గడియారమే గదా మన కాల జ్ఞాని. కలియుగంలో ఇదే పట్నవాసులకు ఆధారం.

''విశ్వనాథంగారు రావడానికి ఆలస్యమయ్యేలావుంది, నేను వస్తా. తిరువళిక్కేణికి నడచి వెళ్ళాలి'' అన్నాను.

తల్లీ కూతురూ లేచి నిలబడ్డారు.

''అప్పుడే వెళ్ళిపోతారా?......సాధారణంగా పార్కు వరకూ వెళ్ళి ఏడు గంటలకల్లా వచ్చేసేవాడు. ఈ వేళేటు పోయాడో!' అన్నది హేమ తల్లి.

''దయచేసి రేపు పొద్దున్న వార్ని మా ఇంటికి రమ్మ వండి'', అని అడ్రసు చెప్పాను.

''మరచి పోతుందేమో!'' అని హేమ కాగితం తీసు కొచ్చి గోల్డు కాప్ పెన్నుతో వ్రాసి పెట్టుకుంది. పెన్ను రవి కెలో గుచ్చుకుంది.

నాకూ ఒక బంగారపు కిరీటం వుంటే బాగుండేది.... అనేలాంటిదేదో ఆలోచన తోచింది నాకు!

ఐదో ఏట బళ్ళో వేసినప్పుడు, నాకు నల్లటి వెల్‌వెట్ టోపీ ఒకటి పెట్టారు. అందులో ఒక అంగుళం మేర జరీ అంచు కుట్టి ఉంది. దాన్ని గురించి హేమతో చెప్పాలి అనిపిం చింది.

అదీ పిచ్చి ఆలోచనే!

మరి, ఇటువంటి పిచ్చి ఆలోచనలక్కూడా విశేషార్థాలు చాలా ఉన్నాయి అని ఫ్రాయిడ్ అనుయాయులు ఇప్పుడు మనకు బోధిస్తున్నారు. ఆ ధోరణిలో ఆలోచించటానికి మాత్రం, మన వాళ్ళల్లో ఆట్టే ఉత్సాహం కనిపించటంలేదు.

వరండాలోంచి మెట్లుదిగి, బయటి గేటు వరకూ అంద మైన చెట్లున్న బాట పొడగునా నాతో వచ్చింది హేమ.

మొల్లపూల పొదరిళ్లు కనపడలేదు; కాని పూల వాసన పసిగట్టాను నేను.

జవ్వంతి పూల చిరు చేదు కూడా చుట్టూ కమ్మింది.

లోపలికి వచ్చేటప్పుడు నేను తోటను గమనించనే లేదు.

''నడచి వెళతారా?'' అన్నది హేమ గేటు దగ్గిర.

''అవును'' అన్నాను ముక్తసరిగా.

''చిల్లర తీసుకురాకపోతే.... ...'' జంకుతూ అంది హేమ.

నేను నవ్వాను. ''నడవటం నాకు ఇష్టం. అందుకే చిల్లర తీసుకుని రాలేదు'' అన్నాను.

''నువ్వు కూడా నాతో దారి పొడగునా నడిస్తే ఇంకా చాలా ఇష్టం'' అని కూడా అనాలనిపించింది. ధైర్యం చాలలేదు. ఏమనుకుంటుందో అని భయం.

గేటు తెరచింది హేమ. ''వెన్నెలగా ఉందే! నడవటానికి బాగానే ఉంటుంది. నేనూ రాగలిగితే.....!'' అన్నది హేమ.

''వస్తాను మరి'', అని బయలుదేరాను, అభివాద ప్రత్యభి వాదాలు ముగించి.

గబ గబా నడిచాను.

## 18

నా నడక చాలా తొందర; నా ఆలోచనా అంతే!

రెండు కాళ్లే ఉన్నాయి నడవటానికి. మెదడులో ఆలో చనా యంత్రానికి ఎన్ని కాళ్లున్నాయో కనిపెట్టి చెప్పినవాళ్ళు లేరు.

ఎనిమిది కాళ్ళ సాలీడు లాంటి దది. నూరు కాళ్ళ జల జంతువు అది. కాదంటే వెయ్యి కాళ్ల జెర్రి......ఏదైతే ఏం? అదొక విష జంతువని అందరికీ తెలుసు. ఆలోచన అన్న చీడ పురుగు పట్టుకుందంటే మానవుడు ఆ పట్టులోంచి తప్పించు కోవటం కష్టమే.

ఇతరులందరూ ప్రయత్నించకుండానే దాని పట్టు లోంచి తప్పించుకుంటారనుకుంటాను. నేను తప్పించుకో డానికే ప్రయత్నించను.

తప్పించుకోడానికి ప్రయత్నించడం ఇష్టంలేదు నాకు.

ప్రయోజకుణ్ణిగా బ్రతకటం నా కిష్టంలేదు. ఆలో చన పరుణ్ణిగా బ్రతకడమే నాకు ఇష్టం. కొన్ని సమయాల్లో కార్యరంగంలోకి దిగవలసి వస్తూందే—అప్పుడే తకరార్లు ఏర్పడు తున్నయి. ఏ పని చెయ్యవలసిన అవసరమే కలగకుండా నే నీ ప్రపంచాన్నే జయించగలను. తనకు తానే ఒకసారి ప్రదక్షిణం చేసి, పందెం గెలిచి, లక్ష్యాన్ని, అహల్యను కైవశం చేసుకొన్న గౌతముడు నా లక్ష్య పురుషుడు. ఇంద్రుడిలాగా ఐరావతం ఎక్కి ప్రపంచం చుట్టూ తిరిగి రావాల్సిన అవసరం మానవు డుగా జన్మించిన వాడికి కలుగుతూందే!—ఇదే మానవ జాతికి ''శాపం'' అని చెప్పాలి.

అహల్యలాంటి వాళ్లకేమో ప్రయోజకులమీదే, ఐరా వతం అధిరోహించి, గప్పాలు కొడుతూ, డాబుగా వూరేగే ఇంద్రుడిలాంటి వాళ్ళమీదే మోజు. ఇదీ న్యాయంలాగే తోస్తూంది.

ప్రయోజకత్వం వ్యర్థమని తెలిస్తే, దాంతోపాటే కార్య శూన్యత్వం తాలూకు బలహీనత కూడా తప్పకుండా తెలుస్తుంది.

మాంబళంలో వెంకట నారాయణా రోడ్డుకు ఆ నంబరు ఇంటికి పోవటం ఒక కార్యం—తిరిగి రావటం ఒక కార్యం. హేమను కలుసుకోటం కూడా ఒక కార్యమే. కాని ఆమె నొక ఊహలాగ ఉంచుకోటమే ఇష్టం నాకు.

అలా ఊహగా ఉంచుకోడాని క్కూడా పూర్వాపరాల్లో చేసిన పనులు రెండూ కావలసి వస్తూండటం దురదృష్టమే. అదే మరీ దౌర్భాగ్యం అనిపిస్తూంది, నాకు.

## 19

లోకంలో గొప్పవాళ్లకు గొప్పఆలోచనలన్నీ వాళ్ళు నడిచే టప్పుడే తోస్తుంటాయనిపిస్తుంది ఎప్పుడూ నాకు.

సోక్రటీసు మొదలు నేటివరకూ, ఉపనిషత్ప్రవక్తల మొదలు జాక్వయిస్ మారిటైన్ వరకూ, పండితులందరికీ నడవటమంటే ఇష్టమయి ఉండాలి. "నడక" చరిత్రను, దాన్ని గురించి లోగడ ఎవరెవరేమి చెప్పిందీ ఎవరైనా దీర్ఘదర్శకుడైన తత్త్వవేత్త పరిశోధనచేసి గ్రంథం రాస్తే, అది ప్రపంచంలో శాశ్వతంగా ఉండే గ్రంథం అవుతుందని నా నమ్మకం.

అవుతుందో కాదో విడవకుండా కొనసాగించవలసిన ఆలోచనే ఇది! నేనే ఈ గ్రంథం రచించాలన్న కాంక్ష లేకపోలేదు. ఆ గ్రంథం టాయెన్‌బీ ప్రపంచచరిత్రకన్నా గొప్ప, చాలా గంభీరమైన, ఎంతో ఉపయోగకరమైన గ్రంథంగా తయారవుతుందనే నా నమ్మకం.

రాయాలన్న ఆశ అయితే వుందికాని, ఇప్పుడు చూడండి నా అనుభవాన్నే చెప్పదలచుకొన్న నేను ఎన్నెన్ని రకాలుగానో తడబడుతున్నా!

కాని హేమను గురించిన అనుభవాన్ని, హేమతల్లిని గూర్చిన అనుభవాన్నీ చెప్పడంలో ఈ తడబాటు న్యాయమనే తోస్తూంది.

నేను విచిత్రమైన వాణ్ణి అనటంవల్లనే కాదు. ఆ అనుభవం, నాక్కూడా కొంచెం విచిత్రమైనది.

"నువ్వా!" అన్న నా మాట వెంటనే ఆ విచిత్రానుభవం ఆరంభమై వృద్ధిపొంది, వలవేసి నన్ను పట్టుకుంది. ఇక నేను తప్పించుకొనే దారిలేదు.

ఈ జన్మానికే కాదు......

వెనుకటి ఏడేడు జన్మల్లోనూ నేను తప్పించుకోలేదు. రాబోయే ఏడేడు జన్మల్లో కూడా తప్పించుకోలేను.

తప్పించుకోటానికి వీలుపడదు. ఎంతవేగంగా నడిచినా తప్పించుకు పోవటానికి వీలుపడదు.

మవుంట్ రోడ్డు వచ్చిందని గమనించకుండానే, అటు తిరిగాను. "ఇంట్లో చెప్పొచ్చావా?" పెద్ద టాక్సీవాడు నన్ను ఒరుసుకుంటూ కారు తోలి, నాలుగు అడుగులు ముందుకువెళ్లి, కారాపి కిటికీగుండా తొంగి చూస్తూ అడిగాడు.

"చెప్పేసి మళ్ళీ వస్తానయ్యా!" అని మర్యాదగానే బదులు చెప్పాను.

దానికి కొంచెం కటువుగానే "పేవ్‌మెంటుమీద నడవ్వోయ్, తమ్ముడూ!" అంటూ వెళ్ళిపోయాడు టాక్సీవాడు.

## 20

జీవితంలో అందరూ రాచబాట మీదుగా నడచి వెళ్ళడం సాధ్యం కాదు. పేవ్‌మెంటుమీద ప్రక్కకు ఒదిగి, ఒదిగి నడిచేందుకు కూడా కొంతమందికే అవకాశం దొరుకుతూందని చెప్పాలి.

నాకు రాముడు అని పేరు పెట్టినప్పుడే, నన్ను రాచబాటకూ, కాలిబాటకూ కూడా తగనివాణ్ణిగా చేసేశారని ఆలోచిస్తూంటే అనిపిస్తూంది.

రాముడనేది ఎంతగొప్ప పేరు! ఎన్నో గూఢార్థాలుగల, ఎంతో శ్రేష్ఠమైన పేరది. ఎన్నో కావ్యాల, నాటకాల పుట్టుకకు ఆధారమైన పేరు.

ఆ పదానికే అర్థం "నేను" అనుకుంటూ కొన్ని సమయాల్లో, నేను మోసపొయ్యేవాణ్ణి.

ఆరోజుల్లో రావణునిఅసురగణం సీతనుమట్టుకే వెంటాడింది. రాముడు సీతామ్మవారిని తనదిగా భావించి, వెతుక్కుంటూ వెళ్లి రావణునితో పోరాడాడు.

రామరావణయుద్ధం కావ్యాల్లో ఉన్నట్టు, జరిగి చాలా కాలం అయిపోయింది. రాముడనే అవతారపురుషుడు, మనిషిలో మంచి అంతటికీ చిహ్నంగా, మంచిని కాపాడేటందుకు వచ్చినవాడు-రావణుణ్ణి, అతని కుటుంబాన్ని నిర్మూలించాడనే కావ్యాలు చెబుతున్నయి.

అంతమాత్రాన లోకంలో అసురగణమంతా నశించిపోయింది అనటం సబబు కాదు.

అసురగణాన్ని నిర్మూలించటానికి, రాముడు ఎంతటి వీరపురుషుడైనా, ఒక్కడు చాలడు.

నేనూ రాముణ్ణే.

నేనూ పోట్లాడవలసిన అవసరం వుంది.

హేమతల్లి వెనుక కదలుతూన్న నీడలో—

—అహో! ఎంతమంది రాక్షసులు దాక్కుని, మారీచుడు, సుబాహువు ఆనాడు విశ్వామిత్రుని యాగశాలలో అశుద్ధాన్ని కురిపించి యజ్ఞం జరగకుండా అడ్డుపడినట్లు హేమ అనే నా తపస్సుకి అడ్డుపెట్టారు!

విల్లెత్తి, నారి బిగించి, బాణం ఎక్కుపెట్టి......

మవుంట్ రోడ్డులో పేవ్‌మెంట్‌మీద కోదండరాముడులాగా, గట్టిగా కాలూనుకొని, ఆలాగే నిలబడిపోయాను. వెనుకనించివచ్చి నామీదపడిన గంపనెత్తుకున్న ముసలమ్మ "నడవ్వేం సామీ!" అన్న తర్వాత జ్ఞాపకం వచ్చింది — నే నెక్కడున్నదీ.

విల్లులేని కోదండరాముణ్ణే నేను. కోదండంలేని వటిృ రాముణ్ణే నేను.

అసురగణం అని నేను అనుకుంటూన్న, మేఘాలలాగ ముసురుకుంటూన్న ఆ నీడ, అసురగణం కాదేమో?

కాని హేమతల్లి........?

## 21

మొదట టాక్సీవాడు, తర్వాత గంప నెత్తుకొన్న ముసిల్ది—ఇద్దరూ నన్ను మందలించారు.

ఇంటికిపోతే నాన్నగారు "ఏం చేస్తున్నావు ఇంతసేపు" అంటారు. ఏడున్నరకి పోయినా అదే ప్రశ్న — పండ్రెండు గంటలకు పోయినా అదే ప్రశ్న. కనుక నేను పండ్రెండుగంటలకు పోవటమే అలవాటు చేసుకున్నాను.

రుక్కు ఒక్కతె మాత్రం ఇలాంటి ప్రశ్న లడగదు. అయితే, రుక్కుకి హేమని గురించి ఒక్కమాట చెబితేచాలు. ఇంక, వెయ్యి ప్రశ్న లడిగి నా ప్రాణం తినేస్తుంది. ఏం చీర కట్టుకుంది? ఏం రవికె తొడుక్కుంది? ఎంత ఎత్తు? బొట్టు పెట్టుకుందా? ఏం బొట్టు? ఏ రంగు? నుదుటి మధ్యగానా? కనుబొమల మధ్యా? తల ఏలా దువ్వుకొంది? నగలు? చెవికి? మెడలో? పళ్ళు వరుసగా వున్నాయా, తిన్నగా వున్నాయా? చిన్నవా? కంటి కొలకుల్లోంచి కాటుక రేఖలు లాగి పెడుతూందా? పై పెదవిమీద కనపడేలా చిరు నెంౘుకలు మొలిచయ్యా? లేదా ? మోచేతిచిప్ప నల్లబడిందా ? చేయికన్నా ముఖం రంగు తక్కువా, ఎక్కువా?......అంటూ ప్రశ్నమీద ప్రశ్న...... ప్రశ్నల వర్షం కురిపించేస్తుంది.

ఇప్పటివరకు, ఈనాటిదాకా ఇలా ఎప్పుడూ జరగలేదు నాకు. అయినా రుక్కూ, దాని పక్కింటి స్నేహితురాలు—ఆమె పేరు జగదాంబాళ్ —నేను వాళ్లిద్దర్నీ రుక్కు, జగ్గు అని పిలవడం మామూలు—మాట్లాడుకోవటం విన్నప్పట్నించీ, వాళ్ళని గురించి నా అభిప్రాయం ఇది.

హేమను గురించి రుక్కు, నన్ను ఇలాంటి ప్రశ్నలు వేసిందంటే, జవాబు చెప్పటం నిస్సందేహంగా నా వల్లకాదు. ప్రతి ప్రశ్నకీ "తెలియదు" అనే జవాబు చెప్పాలి.

అవేమీ నేను గమనించలేదు.

హేమ అందంగా ఉంటుంది అని మొత్తంగా, ఒక అభిప్రాయం మట్టుకు కలిగింది నాకు. అంతేకాని, ఆమె అందచందాల హేతువు లేవీ నాకు జ్ఞాపకం రావటంలేదు. ఇప్పుడు ఆలోచించి చూస్తే కూడా ఆమె ముఖాన్ని నా మనస్సులో రూపు కట్టుకోలేకపోతున్నాను.

పేవ్‌మెంటుమీదుగా ఫౌజెండ్‌లైట్స్ మలుపులో తిరువళిక్కేణికి మళ్ళేముందు, నిలబడి ఆలోచించాను.

ఆమె ముఖం జ్ఞాపకం చేసుకోలేక పోతున్నాను. ఏం చీర కట్టుకుంది? బొట్టు ఎలా పెట్టుకుంది? రవికె ఏ రంగుది—ఏదీ జ్ఞాపకం రావటంలేదు.

ప్రయత్నించి చూడగా, చూడగా, ఒక్కటిమాత్రం స్పష్టంగా తెలిసింది నాకు.

హేమతల్లి, ఆమె నీడతోసహా, నా మనోనేత్రానికెదురుగా, సాయంత్రం కనిపించినట్టే—అలాగే ప్రత్యక్షమయింది. ఆమెని గూర్చి రుక్కు ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడిగినా బదులు చెప్పేయగలను. ఆమె రూపం, పూర్తిగా, సూక్ష్మాతిసూక్ష్మ విషయాలతోసహా నా మనస్సులో ముద్రపడిపోయింది.

అదే! చెప్పాంగా. నేను కాస్త విచిత్రమైన మనిషిని అని!

విచిత్రం ఏమిటి? పిచ్చే!

## 22

ఆరోజు రాత్రి రుక్కు నన్నేమీ అడగలేదు. నేను ఆమెతో హేమను గూర్చి ఏమీ చెప్పలేదు కనుక నాన్న కూడా అలవాటు ప్రకారం కాకుండా, తన స్నేహితుణ్ణి గురించి అడిగారే తప్ప, నే నెందుకు ఆలస్యంగా వచ్చిందీ అడగలేదు.

ఆయనలేరనీ, మర్నాడు పొద్దున్న రమ్మని చెప్పేసి వచ్చాననీ చెప్పాను.

కొడుకు ప్రయోజకుడయాడనుకున్నారో ఏమో, "భేష్" అన్నారు. "వాళ్ళింట్లో వాడి మేనకోడలు ఒకమ్మాయి ఎవరో బి. ఏ. చదువుతూందని చెప్పాడే!" అన్నారు.

ఉలిక్కిపడ్డ నేను "ఇదేం కుట్ర?" అనుకుంటూ, తలెత్తి చూశాను. "ఎవరో వయస్సు మళ్లినావిడ ఒకర్నిమాత్రం చూశాను. విశ్వనాథంగారు తన తమ్ముడు అందావిడ," అని తెలివిగా బొంకాను.

మా నాన్నగారిని గూర్చి నేనే విధంగానూ తీర్మానించుకోలేకపోతున్నాను. ఆయన వట్టి అమాయకులా? వివేకవంతులా? పండితుడా, కార్యశూరుడా, పిచ్చివాడా, పిచ్చిలేనివాడా? ఏదీ, ఎటూ అర్థంచేసుకోటానికి, పద్దెనిమిదేళ్లుగా ప్రయత్నిస్తున్నాను—ఆయన్ని అర్థం చేసుకోటం సాధ్యంకాకుండావుంది. కొన్ని సమయాల్లో ఆయన మనిషేకాదు అన్న తీర్మానానికి రావాల్సిన అవసరం కూడా ఏర్పడేది నాకు.

"గొప్పవాళ్ళు అని పేరుబడిన వాళ్ళంతా, తమ చిన్న వయస్సులో తమ తండ్రులను మించటానికి ఎంతో ప్రయత్నం చేసినవాళ్లే, అందులో కొందరు తప్పించుకోవచ్చు; చాలామందికి తప్పించుకోటానికి వీలుపడదు. ఇలా తప్పించుకోనివాళ్ళకు ఆ పోరాటంలోనే, వారి జీవితంలో చాలా భాగం గడచిపోతుంది".

—ఇది ఎక్కడో ఓ పిచ్చివాడి పుస్తకంలో చదివాను. ఎక్కడో, ఎవరు రాసిందో, ఏ సందర్భంలో రాసిందో జ్ఞాపకం రావటంలేదు.

కాని, మా నాన్నగారు నా నోటు స్తకంలో ఈ వాక్యాన్ని చదివి, "నిజమే" అన్నారు.

నేను అనుకుంటూన్నది నిజం అని ఒప్పుకునే వాళ్ళంటే నాకు సాధారణంగా పడదని ఇదివరకే చెప్పాను నాన్నగారిని ద్వేషించటానికి ఇంకో కొత్త కారణం దొరికింది.

"నా తండ్రినుంచి తప్పించుకోటానికి నేను మొదటిసారి ప్రయత్నం చేశాను—చేత కాలేదు" అన్నా రాయన.

మానాన్నగారు హరిశ్చంద్రుళ్ళాంటివారు కాదు కాని ఆయన చెప్పిన ఆమాట మాత్రం నిజమయ్యే ఉంటుంది.

## 23

మా నాన్నగారి అదుపులోంచి బయటపడి బ్రతకాలి అన్న భావం నాక్కలిగి చాలాకాలమయిందనే చెప్పాలి.

నాకు జ్ఞాపకం ఉంది—నా ఎనిమిదోయేటే మాబామ్మ రాముడు.....అచ్చా.....వాళ్ళ నాన్నలాగే ఉన్నాడు!" అనేది.

కన్నతల్లి ఆమెకు తన కొడుకు ఎలాంటివాడో తెలుసు గదా? ఆ రోజునుంచే నాకు, మా నాన్నగారిలాగ ఉండకూడదు అన్న పట్టుదల ఏదో కలిగింది. ఈ పదేళ్ళగా ఈ భావం ఎదుగుతూ వచ్చి, ఇటీవల బాగా ప్రబలమయిందని చెప్పాలి. సడలిపోయే సూచన ఏమీ లేదు.

చూడగా, చూడగా నేనూ క్రమంగా కొంచెం కొంచెంగా నాన్నలాగే అవుతున్నానేకాని, ఆయనకి దూరంగా పోతున్నాననే నమ్మకం నాకూ కలగటంలేదు.

ఆయన ముక్కుపొడుం పీలుస్తారు. అది నాకు అలవాటులేదు. అంతే తేడా. తక్కిన వాటిలో ఎందులోనూ మాలో వ్యత్యాసం కనిపెట్టడానికి వీల్లేదు.

కొన్ని సందర్భాల్లో నేను మా గ్రామానికి వెళ్ళాల్సి వచ్చేది. మూడేళ్ల క్రిందట "వెళ్ళి రామచంద్రం దగ్గర భూముల ఫలసాయం తాలూకు డబ్బు తీసుకురారా!" అని మా నాన్నగారు పంపారు. ఆ రామచంద్రంగారి దగ్గిరికిపోయి, ఆయన ఎదుట నిలబడ్డాను. వెంటనే "రా, నారాయణా రా!" అన్నారు. నా పేరు రాముడు అని చెప్పి చూశాను. కాని ఆయనకి నేను నారాయణుణ్ణే—అంటే మా నాన్ననే.

"నీ వయస్సులో ఇలాగే మీ నాన్న కూడా ఉన్నట్టుండి ఏదేదో మాట్లాడటానికి ప్రారంభించేవాడు. పొడైపోతాడేమో పిచ్చాడు అని మేమంతా భయపడ్డాం" అంది మంగళం బామ్మ.

ఆ పక్కనేవున్న సుబ్బలక్ష్మి అమ్మాళ్ "బాగా చెప్పావ్, వాడా పిచ్చాడు! వాడు పదిమందికి పిచ్చ లెత్తించగలడు!" అంది.

నిజంగా, నా ప్రియమైన జనకుడే, మా నాన్నగారే నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నారు. కనుపించిన తన స్నేహితులందరితో వూరికేనాగొప్పలుచెప్పి పొగడుతారు — పొగడేయటంలో ఇలా అలా కాదు— వూరికే తెగ పొగడేసేవారు. వాళ్ళు వెళ్లిపోయింతర్వాత "ఏరా! దద్దమ్మా!" అనేవారు. మరి వాళ్ళ ముందు, అలా పొగిడారేం అంటే, "ఒ ద్దిమంతుడివే! వెళ్ళు!" అనేవారు.

మా నాన్నగారిలాగే నా కాలేజీ లెక్చరర్లందరూ "రాముడికి సాధారణ లోకజ్ఞానం తక్కువ; కాని చదువుల్లో మట్టుకు చాకులాంటివాడే! అనేవారు.

## 24

నేను చదివేది చాల తక్కువే. ఏదో ఒక్క విషయాన్ని-సార హీనమైన పాఠ్యపుస్తకాల్లోవున్న విషయ మేదో చదివితే—వేరే ఏవో తొమ్మిది రసవద్విషయాలు నా మనస్సులో ఉరుకులు పరుగులు ప్రారంభిస్తాయి. అంచేతే, నేను చదివేది చాల తక్కువే.

పరీక్షల్లోమాత్రం అన్నిసబ్జెక్టుల్లోనూ హేమ చెప్పినట్టు నేనే ఫస్టు.

ఎందుకొస్తాయో, ఎలా వస్తాయో నాకే తెలియదు. దీన్ని గురించి గొప్పగా చెప్పుకోవాలని కూడా నాకు లేదు.

విద్యార్థిగా నామీద కాలేజీ లెక్చరర్లందరికీ మంచి అభిప్రాయమే. నాలాంటి విద్యార్థి ఏ పది ఇరవై ఏళ్ళలోనో ఒక్కసారి కనిపిస్తాడని నాకువినబడేటట్టుగా వాళ్ళలో వాళ్ళే అనుకునేవాళ్ళు. వాళ్ళు పాఠ్యపుస్తకాల్లో చదివి ఉంటారు—ఎందరో మేధావులు తమ చిన్న తనంలో నాలాగే "లూజ్"గా ఉండేవారని చదివి, జ్ఞాపకం ఉంచుకుని ఉంటారు.

ముఖ్యంగా మా లెక్కల మాష్టారు పాట్రాచారి గారికి నేనంటే ఎంతో నమ్మకం. నే నొక అపరరామానుజాన్ని అని తీర్మానం చేశారు—పాపం! తన పాతచింతకాయపచ్చడి గూర్చి పాతధోరణిలోనే మాట్లాడుతూ తృప్తిపడే రకం మనిషి. తన పాతచింతకాయపచ్చడి వాసన నాఎల్ల వూరూ వాడా అంతా, లోకమంతా వ్యాపిస్తోందని, ఆయన కలలుగంటున్నట్టుంది పాపం!.... నాకీ సంగతి స్పష్టంగానే తెలుసు.

పాపం! అని ఎందుకు అంటున్నానంటే

ఆయన మసలితనపు కలల్ని నేను నాశనం చెయ్యాలనే, నా మనస్సు లోలోపల ఆశిస్తోంది. నే నొక రామానుజాన్ని అయిపోవాలని కోరేందుకు ఆయ నెవరు? ఏమిటా కోరిక?

ఆయన కంటూన్న కల లేవీ, నావల్ల నిజం కాకూడదు—ఎన్నటికీ కాకూడదు—అలా కాకుండా చూడటం నా మొట్ట మొదటి బాధ్యత అనుకుంటున్నాను.

ఎన్ను మించిన శక్తి ఏదో నా కీ హెచ్చరిక చేస్తూంది. ఆ బోధను నేను పెడచెవిని పెట్టటం అసాధ్యం.

నామీద అంత ఆశపెట్టుకొన్న మా లెక్కలు మాష్టారు గారికి, నామీద చాలా అసంతృప్తి కూడా ఉంది అని తెలుసుకోటం కూడా నాకు సంతృప్తే.

క్లాసులో తాను చెప్పిందాన్ని నేను వినటమే లేదని ఆయన అసంతృప్తి.

నిజమే. నేను వినటం లేదు.

నేను వినేందుకు వారేమీ అంత గొప్ప విషయాలు చెప్పడం లేదు!—నేనేం చెయ్యను!

## 25

వెంకటనారాయణారోడ్డుకి నేను వెళ్ళి వచ్చిన మరుసటి రోజు కాలేజికి సెలవు. ఆ మర్నాడూ సెలవే. మూడోరాజు, కాలేజీలో మొట్టమొదటి క్లాసు లెక్కల క్లాసే.

అంతవరకూ క్లాసులో ఎవరెవరున్నారన్నది కూడా గమనించి చూడని నేను, ఆరోజు ఆమె ఎక్కడ, ఎక్కడ అనుకుంటూ కళ్ళు తెరచి క్లాసంతా గాలించాను.

ఏ పిల్లని చూసినా మొదట నాకు, నా పడుచు కళ్ళకు, ఆమెలాగే కనబడింది. కొంచెంసేపయింతర్వాత, ఆమె కాదని తీర్మానించుకోవలసి వచ్చేది. నా నుదుటిమీద ముడుతలు పడేటట్టు నే నా తీర్మానానికి రావటానికీ, ఆమె ఆరోజున ఆలస్యంగా రావటానికి, సరిపోయింది.

అసలామె ఏనాడైనా క్లాసుకు సరైన వేళకు వచ్చిందా?

ఇన్ని రోజులూ అంతరంగంలోంచి పెల్లగించుకొని పైకిరాని ఈ స్మృతి, నా కీ రోజున చటుక్కున కలిగింది.

వచ్చినామె మాష్టర్నీ, విద్యార్థులనీ, ప్రత్యేకంగా నన్నూ ఓరకంటితోచూసి, తన సీటులోకి వెళ్ళి కూచుంది. కాటుక, మత్తు, మత్తూ మైకం కలిగించే శక్తీవున్న కళ్ళామవి. నీలంగా నల్ల నల్లగా, ప్రాణాల్ని త్రాగి సంతోషించే కళ్లామెవి, అని నా చెల్లెలు రుక్కుకి చెప్పేందుకు శ్రద్ధగా చూశాను.

మహాకవి డాంటేని బియాట్రిస్ స్వర్గమంతా త్రిప్పి చూపి, ఏ దైవసాన్నిధ్యంలోకో తీసుకువెళ్లి అతణ్ణి పరవశుణ్ణి చేసిందట. ఈ నా బియాట్రిస్ నన్ను బహుశః నరకానికి తీసుకపోవచ్చు. స్వర్గం అంటే నమ్మకంలేని వాళ్ళంగద మనం!

నా బియాట్రిస్‌తో మానసికంగా, నరకలోకంలో సంచరిస్తూన్న నేను, లెక్కల మాష్టారు చెబుతున్న ముఖ్యమైన విషయాన్ని గమనించలేదు. ఆయన "రామూ!" అని మొదటిసారి పిలిచింది కూడా నా చెవిని పడలేదు. రెండోసారి "రామూ!.." కొంచెం గట్టిగానే వినబడింది.

"ఏం సార్!" అని లేచి నిలబడ్డాను.

"నిద్రా?" అన్నారు ఆవకాయగారు.

"లేదు, కల" అని వున్నమాటే అన్నాను.

క్లాసంతా గొల్లుమని నవ్వింది.

అందరి నవ్వుల్లోకీ హెచ్చుస్థాయిలో వినబడింది ఆమె నవ్వు. నన్ను తికమక పెట్టడానికి వచ్చిందామె!

లెక్కల మాష్టారికూ్కడా నవ్వే వచ్చింది. మొదట ఎందుకోసం పిలిచారో—ఆ సంగతి మరచిపోయి, "కూచో!" అన్నారు.

## 26

హేమను, నే నామె ఇంటికి వెళ్ళిచూసొచ్చి డెబ్భయి రెండు గంటలసేపు అయిపోయింది. డెబ్భయి రెండు గంటలసేపులో నే నామెను మరచిపోవచ్చును అనుకున్నాను;—నేను పిచ్చివాణ్ణే.

ఈ డెబ్భయి రెండు గంటల్లో ఆమె తల్లిని కూడా మరచిపోలేకపొయ్యానే; ఆమెనా?.....ఎలా మరచిపోగలను!

హేమ క్లాసులోకి వస్తూ, కాటుక కారే కళ్లతో నన్ను చూసిన చూపుకి అర్థమేమిటి?

"నువ్వు తప్పించుకోలేవయ్యా. తప్పించుకోలేవు!" అంటున్నట్టు నేనాచూపులో చదివాను.

ఇందులో ఆమె తప్పు ఒకటుంది. నే నామెనుంచి తప్పించుకోదలచానని ఆమె అనుకుందే, అదే తప్పు.

తప్పించుకోవాలనుకోలేదుగా నేను !

నా ముఖాన 'ఆమె' వ్రాసి ఉంటే, తప్పించుకోటానికి నే నెందుకు ప్రయత్నించాలి?

తప్పించుకోటానికి దారిలేదు అని ఎక్కడో, పూర్వజన్మ వాసన కూడా కలిసి, హెచ్చరిస్తూన్నప్పుడు, నేను తప్పించుకోటానికి ప్రయత్నించటం ఎందుకు?—ఓడిపోవటం ఎందుకు?

ఆశపడనివాడు గొప్పఅదృష్టవంతుడే. అసలు, నేను తప్పించుకోవాలని అనుకోనూలేదు.

రెండు రోజులు కాలేజీకి సెలవు వచ్చినా తన్నెందుకు చూట్టానికి రాలేదని అడిగిందేమో ఆ చూపులో?

"మీ అమ్మగారూ, ఆమె నీడా నన్ను భయపెడుతున్నారు. అంచేతే నేను రాలేదు" అని వున్నమాట నేను ఆమెతో చెప్పెయ్యగలిగితే బాగుణ్ణు.

నా ఆలోచనల్లో ఆమె కూడా భాగం పంచుకొని అవస్థపడితే పడుతుంది.....నష్టమేమిటి?

ప్రేమంటే సుఖంలో మట్టుకు భాగం పంచుకోవటం అని ఎలా అంటాం? కష్టంలో కూడా భాగం పంచుకోవాలి!

నేను రాముణ్ణని గుర్తించినట్టే, తన తల్లిని తాటకి అనో, శూర్పణఖ అనో ఆమెని కూడా భావించుకోనీ!

ఈ ఆలోచనల అంటు వ్యాధి ఆమెకీ సోకనీ, ఆమె సొగసుని కొంత పాడు చేయనీ!

నా ఆలోచన్ని ఆమె అర్థం చేసుకుందంటే, ఆమె కాటుకకళ్ళుత్రిప్పటం, కవ్వించటం కొంచెంతగ్గవచ్చునేమో ! కాని, అవి తగ్గాలనేనా నేను కోరుతూంది?

అసురగణాన్ని ఎదిరించి పోరాడటానికి ఆ రాముడికి, గొప్ప కోదండమూ, లక్ష్మణుడూ అండగా ఉన్నారు. నా వద్ద కోదండమూలేదు. తోడుగా లక్ష్మణుడూ లేదు.

శూర్పణఖ దగ్గర దగ్గరకి వస్తూంది—చాలా దగ్గిరికే వచ్చేసింది. నొక్కేస్తూంది.

శూర్పణఖ నీడలో వేనకువేలు రాక్షసులు దాక్కొని ఉన్నారు. నా "రామ" రామణీయకాన్ని నాశనం చేయటానికి కాలు దువ్వుతున్నారు.

లక్ష్మణా!

అయ్యో లక్ష్మణా!

## 27

విద్యార్థుల్లో రెండురకాలవాళ్ళున్నారు. ఒకరకంవాళ్ళు చదివి పాడయే రకం. ఇంకొక రకంవారు చదవకుండానే పాడైపోయే రకం.

ఎలాగూ పాడైపోయేరకమేకదా ఈ విద్యార్థి లోకమంతా అనే ధోరణిలోనే ఏడాదియేడాదికీ కొంచెం, కొంచెంగా మనకాలేజీపాఠ్యగ్రంథాలస్థాయి దిగజారుతూ వస్తూంది. ఇలా దిగజారటానికి తోడుగా ఈ రోజుల్లో కళాశాల్లో చదువు చెప్పే రోజుల్ని తగ్గించి తరచు వారానికి మూడు రోజులు, నాలుగు రోజులూ సెలవు లిచ్చేస్తున్నారు.

ఈ పిల్లలంతా చదువుకొని చెడిపోవటానికి బదులుగా, చదువుకోకుండానే చెడిపోకూడదా అని విద్యాధికారుల ఉద్దేశం అనుకుంటాను.

1950 లో చదివే ఈ చదువు 1940 లో కూడా ఉపయోగపడుండదు. 1960 లో బ్రతకాల్సిన పిల్లవాడు ఈ చదువులు చదివి ఎలా కడతేరగలడు అన్న సందేహ మేదో మన విద్యాధికారులను భాధిస్తున్నట్టుంది!

ఆ ఒక్కరోజు కాలేజీ తర్వాత, మళ్ళా రెండురోజులు ఎవరో పుట్టారు, ఎవరో చచ్చారు—ఇప్పుడు అధికారంలో ఉంటూన్నవారు వాళ్ళని గొప్పవాళ్ళుగా నిర్ణయించారు గనుక—సెలవు.

మొదటి రోజంతా రుక్కుతో కేరం బోర్డు ఆడేస్తూ గడిపాను. ఆమె చూడకుండా ఉన్నప్పుడు బోర్డుమీద రెండు బిళ్ళల్ని దొంగతనంగా పాకెట్టులోకి నెట్టి కూడా చూశాను. అప్పటికీ రుక్కే గెలిచింది.

ధర్మమే ఈ లోకంలో గెలుస్తుందనడానికి ఇదొక సూచనా?

కేరం బోర్డులాంటి సాధారణమైన విషయాల్లో మట్టుకే ధర్మం గెలుస్తుందా?

రుక్కునే అడిగాను.

ఆమె చెప్పిన జవాబు విని చిత్తైపోయాను. "నీకు ఆటూరాదు, టక్కరు చెయ్యటమూ తెలీదు అన్నయ్యా" అంది రుక్కు.

ఆట తెలీదు—ఒప్పుకుంటాను.

టక్కరు చెయ్యటం కూడా తెలీదా?

మోసగించటమైనా తెలిసుండకపోతే ఎల్లాగని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

"టక్కరి మాటలు చెప్పటంలో అందరూ రుక్కువద్ద నేర్చుకోవాల్సిందే మామా!" అంది జగ్గు.

ఆ మాట కూడా వింతగానే ఉంది నాకు.

## 28

మర్నాడు పొద్దున్నే ఎవరింట్లోనో ఏదో అయుంటుంది. సన్నాయిమేళం, డోళ్ళూ, నా చెవినీ, మనస్సునూ అదరగొట్టడం మొదలెట్టాయి. తెల్లవారుజామునే మేల్కొన్న నేను, కొంతసేపు చావుని గురించిన ఆలోచనల్లో సుళ్ళు తిరిగి తిరిగి, లేచి స్నానం చేసి, చొక్కా తొడుక్కుని, వీధి చివరి హొటల్లో ఓ కప్పు నాసిరకం కాఫీ తాగేసి, మనస్సులో బాధ తీరేందుకు కాళ్ల నొప్పులు తెచ్చుకుందాం అని నడిచాను.

తిరువళిక్కేణినించి, పైక్రాఫ్ట్స్ రోడ్డుమీదుగా మవుంట్‌రోడ్డుకు వెళ్ళాను. మవుంట్‌రోడ్డమ్మట నడుస్తూ, వెంకటనారాయణారోడ్డు ఎదురయ్యేదాకా వచ్చేశాను. పొద్దుటిపూట అలా నడవటం సుఖంగానే ఉంది. రోడ్డుమీద జనం ఎక్కువలేరు.

"ఆమె" ఇంటికి పోవాలనే ఉద్దేశంతో బయలుదేర్లేదు నేను. పొద్దున్న ఏడున్నరే అయ్యుంటుంది. త్యాగరాయనగర్‌నించి తిరిగి రోడ్డమ్మట వెళ్లిపోదామనే అనుకున్నాను. కాళ్ళు వాటంతట అవే నన్ను ఆరోడ్డువైపు త్రిప్పినయ్. అటు వెళ్ళాను.

సరిగ్గా ఆ సమయంలో నాలో ఆలోచనల్లో అలజడి ఏమీ లేదు.

ఆమె యింటి ముందుకి వచ్చేసింతర్వాత, కొంచెం ఆగి, అక్కడే నిలబడ్డాను.

నిజానికి నేను స్వయంగా లోపలికి వెళ్ళుండేవాణ్ణి కాననుకుంటాను. గేటుకు దూరంగా గులాబి మొక్కల పక్కన హేమమామగారు నిలబడున్నారు. నేను సమాచారం చెప్పడానికి వెళ్ళిన మర్నాడే ఆయన మా ఇంటికి రావడం, మా నాన్నగారూ, ఆయనా ఆ రోజు పగలంతా మాటల్లోనే గడిపేయటం—అది పాత కథ.

ఆయన నన్ను చూడగానే "లోపలికి రా బాబూ!" అని పిలిచారు; నా కోసమే ఎదురు చూస్తున్నట్టు. వెంటనే గేటు తెరచుకుని లోపలికి వెళ్లిపోయాను.

నా మనస్సులో బాధ తీరినట్టే ఉంది. మా వీధిలో విన్న సన్నాయిమేళం, చావులజ్ఞాపకాలూ నాకు దూరమైపోయినయ్.

ఎంత దూరమైనా నడవటానికి సరదాపడేవాణ్ణి నేను. నడిచి, నడిచి నడకకి బాగా అలవాటు పడిపోయినవాణ్ణి నేను. అయినా నాకాళ్ళు కొంచెంగా నొప్పెట్టటం ఆరంభించినయి.

హేమమామగారు ముందునడుస్తూంటే, నేను ఆయన్ని వెంబడించాను. ముందుగదిదాటి హాల్లోకి వెళ్ళాం. హాల్లో ఉయ్యాలమీద కూచుని ఉంది హేమతల్లి.

ఉయ్యాల వేగంగా ఊపుతున్న ఆవిడ, నన్ను చూడగానే వేగం కొంచెం తగ్గించింది. ఊపటం ఆపేసింది. కాని ఉయ్యాలమీంచి క్రిందికి దిగలేదు.

"కూచోవయ్యా, నేను వెళ్ళి కాఫీ తెమ్మంటాను" అన్నారు విశ్వనాథంగారు.

"కాఫీ వద్దండి. ఇప్పుడే తాగాను," అన్నాను.

## 29

ఎందుకీరోజు ఇక్కడికి వచ్చానా అనిపించటం మొదలెట్టింది నాకు. మాటిమాటికి రేగుతున్న జుట్టు చేతివేళ్ళతో సవరించుకుంటూ, విశ్వనాథంగార్నికాని, హేమతల్లినికాని చూడకుండా, హాల్లో గోడకు తగిలించిన అందమైన పటాల్ని చూస్తూ నిలుచున్నాను.

"కూచోండి" అంటూ ఒక మెత్తని దిండు వేసిన పేము కుర్చీ చూపించింది హేమతల్లి.

"ఆరోజు నే వెళ్ళి చూసొచ్చానే—నారాయణ అనే నా స్నేహితుణ్ణి—ఆయన కుమారుడు ఈ అబ్బాయే! రాము అంటారు. హేమ క్లాసులోనే చదువుతున్నాడు" అని చెప్పుకుంటూపోయారు హేమమామగారు.

"తెలుసులే! ఆరోజు ఈ అబ్బాయే నిన్ను వెదుక్కుంటూ వచ్చింది. అరగంటసేపు మనింట్లో నీకోసం ఎదురు చూసి చూసి వెళ్ళిపోయాడు!" అంది హేమతల్లి.

"నేను ఈ రోజు కూడా తిరువళిక్కేణి వచ్చి మీనాయన్ని చూడాలనుకున్నా.....తోటలో మనిషి పనిచేస్తున్నాడు. ఏమేం చేయాలో వాడికి చెప్పి వచ్చేస్తాను. తర్వాత తాపీగా మాట్లాడుకుందాం. తొందరేంలేదు," అంటూ బయటికి వెళ్ళారు విశ్వనాథంగారు.

నేను హేమతల్లి చూపించిన కుర్చీలో కూచున్నాను.

పూర్తిగా ఆగిపోయిన ఉయ్యాలను మెల్లగా కాలితో నేల తన్ని వూపుతూ హేమ తల్లి తనంత తానుగానే చెప్పింది: "హేమ బాగా పొద్దున్నే, ఎవరో స్నేహితురాల్ని చూడాలని, బండితీసుకునివెళ్ళింది. ఇంకొక అరగంటలో వచ్చేస్తుంది" అని.

మెల్లగా కదులుతూన్న ఉయ్యాల వెనుకపక్క, ఒక రాక్షస స్వరూపం, వట్టి పీడలా నిలబడి, పళ్ళికిలించి, నన్ను గేలి చేస్తున్నట్టు భ్రమ కలిగింది నాకు. అటు చూస్తూనే, దాన్ని చూడకుండా ఉండటానికి ప్రయత్నం చేస్తున్నాను.

హేమతల్లి చూచాయగా రెండు విషయాలు నాకు బోధ పరచింది—ఆ ఒక్క వాక్యంతో. ఒకటి, వాళ్ళకి కారు వుందన్న సంగతి. రెండవది నేను హేమకోసమే వెతుక్కుంటూ వచ్చానని తాను అభిప్రాయపడుతూన్న సంగతి.

నేను హేమను వెదుక్కుంటూ రాలేదు అని చెప్పి ఉండాల్సింది.

అలా చెప్పింటే, దానికి ఏవిధంగా అర్థంకల్పించుకునేదో ఆవిడ? నేనేమీ బదులు చెప్పలేదు.

వెనుకపక్క రాక్షసిరూపంలో కనబడుతూన్న, పీడ శూర్పణఖకి చెందిందా, తాటకికి చెందిందా అని తేల్చుకోటానికి ప్రయత్నిస్తూ వుండిపోయాను.

## 30

హేమను వెతుక్కుంటూ కాకపోతే, నే నెందుకు మళ్ళీ ఆ ఇంటివేపు వెళ్ళటం?

ఆమె మామయ్యని వెతుక్కుంటూనా? లేకపోతే అందమైన కాలుతో ఉయ్యాల మెల్లిగా తోస్తూ కూచుందే, హేమ తల్లి — ఆమెను చూడ్డానికి వచ్చానా?

నేను హేమకోసం రాలేదని చెప్పింటే హేమ తల్లి కూడా నమ్మేదికాదు. అంచేత, చెప్పకుండా ఉండటమే మంచిదయింది.

"మీపేరు రామమా? మంచిపేరు" అంది హేమతల్లి.

ఆమె పేరు శూర్పణఖ. ముక్కూ, చెవీ కోసి ఈమెను అవమానపరచటానికే, నా కింక లక్ష్మణుడు కావాలి.

చుట్టూ చూశాను—లక్ష్మణుడి జాడ ఎక్కడా కనబడలేదు.

అయ్యో! లక్ష్మణా!

"మీరు చాలా గట్టివారని మా హేమ చెబుతూ ఉంటుంది" హేమతల్లి అంది.

నేను బదులు చెప్పలేదు. ఏమని బదులు చెప్పడం? గట్టివాణ్ణైన నాకు దీనికేం బదులు చెప్పాలో, తెలియటం లేదు.

ఉయ్యాల వూగే వేగం కొంచెం ఎక్కువైనట్టుంది. దేనిమీదో దూకడానికి దాక్కొని, తోకమాత్రం పైకెత్తి వూపే, పిల్లి జ్ఞాపకం వచ్చింది. హేమతల్లి గొంతెత్తి "ప్రేమ అంటారే, దాన్ని గురించి మీ అభిప్రాయమేమిటి?" అని అడిగేసి, నా వంక సూటిగా, ప్రశ్నార్థకంగా చూసింది.

అయ్యో! లక్ష్మణా!

"ప్రేమను గురించా" అన్నా న్నేను, ఉలిక్కిపడి, ఆశ్చర్యంతో.

అది తాటకి పీడకాదు; శూర్పణఖ పీడే—సందేహం లేదు.

ప్రేమను గురించి నేనేమనుకుంటున్నానో తెలుసుకోగోరుతూందా ఆమె? అయ్యో!

"అవును, 'లవ్', 'లవ్', అంటుంటారే! దాన్ని గురించి" అని ఉయ్యాల వూగే వేగాన్ని కొంచెం తగ్గించుకుంటూ అంది హేమతల్లి. ప్రేమ అని తెలుగులో చెబితే అర్థం కాదేమో అని సందేహించినట్లు, ఇంగ్లీషులో "లవ్" అని కూడా చెప్తూంది.

హేమతల్లిని ఇంగ్లీషు తెలిసినావిడగా గౌరవించలేను నేను. ఇలాంటివి ఒకటో రెండో మాటలుతప్ప, ఆమెకు మూడో ఇంగ్లీషు మాట తెలిసి ఉండదు.

ఉయ్యాల వేగం కొంచెం ఎక్కువైంది. పీడ కదిలింది.

(సశేషం)